పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో మంత్రి వివేక్ భేటీ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో రాష్ట్ర కార్మిక, గనులశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సోమవారం దిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయం ఇందిరాభవన్‌లో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. విష జ్వరం నుంచి కోలుకున్న ఖర్గేను పరామర్శించి ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితుల గురించి ఆయనకు వివరించారు. 22ఏపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన సమాధానం, కేసీఆర్ కుటుంబ భూముల గురించి బయటపెట్టిన విషయాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన చర్చనీయాంశం అయిన విషయం గురించి చెప్పారు. శాసనసభ స్పీకర్‌పై భారాస నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యల గురించీ ఖర్గే దృష్టికి తీసుకెళ్లారు. ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో తలెత్తిన వర్షాభావ పరిస్థితుల గురించీ వివరించారు.

## సిలబస్ మార్పుపై టీజీపీఎస్సీ కీలక ప్రకటన..

# అభ్యర్థులకు ఊరట

- పోటీ పరీక్షల సిలబస్‌పై వస్తున్న వదంతులకు టీజీపీఎస్సీ తెర
- ప్రస్తుతానికి ఎలాంటి సిలబస్ కమిటీని ఏర్పాటు చేయలేదని వెల్లడి
- పెద్ద మార్పులు ఉంటే ఏడాది ముందుగానే సమాచారం ఇస్తామని హామీ
- చిన్నపాటి మార్పులను నోటిఫికేషన్‌లోనే తెలియజేస్తామని ప్రకటన




-4 లో

# 'ఓ పార్టీ ఎమ్మెల్యే మరో పార్టీ ఎంపీగా పోటీపై నిషేధం లేదు'

- హైకోర్టు మహాచంద్రప్రసాద్ కేసు తీర్పును ఆటోమేటిక్‌గా వర్తింపజేసింది
- ఈ కేసులో పరిస్థితి దానికి భిన్నం
- సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో దానం నాగేందర్
- రేపు విచారణ




**హైదరాబాద్ పెన్ పవర్:** ఒక పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన వ్యక్తి మరో పార్టీ నుంచి లోక్‌సభకు పోటీచేయకూడదని రాజ్యాంగపరమైన నిషేధమేమీ లేదని దానం నాగేందర్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. దాన్ని ప్రాతిపదికగా తీసుకొని హైకోర్టు తనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించడాన్ని తప్పుబట్టారు. గతంలో ఇలా వేరే పార్టీ నుంచి పోటీచేశారన్న కారణంతో బిహార్‌కు చెందిన మహాచంద్రప్రసాద్‌ను సుప్రీంకోర్టు అనర్హుడిగా ప్రకటించిందన్న ఏకైక కారణాన్ని ప్రాతిపదికగా తీసుకొని స్పీకర్ ఆదేశాలను హైకోర్టు కొట్టేయడం పొరపాటు అని పేర్కొన్నారు. పిటిషన్‌లో ఇంకా ఏమన్నారంటే..

"నేను సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీచేసినంత మాత్రాన భారాస నుంచి ఎన్నికైన నా శాసన సభ్యత్వం రద్దయిపోదు. ఒక పార్టీ ఎమ్మెల్యే మరోపార్టీ నుంచి పార్లమెంటుకు పోటీచేయకూడదని రాజ్యాంగ నిబంధనకానీ, చట్టబద్ధమైన నిషేధంకానీ లేవు. మరోవైపు భాజపాకు చెందిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌తో కలిపి దీన్ని విచారించారు. మరో రాజకీయపార్టీకి చెందిన వ్యక్తి సమాంతరంగా అనర్హత ప్రొసీడింగ్స్ ప్రారంభించడం అన్నది పూర్తిగా రాజకీయ దురుద్దేశపూరితం. రాజకీయ కక్షసాధింపునకు నిదర్శనం.

**భారాస ఆదేశాలన్నింటినీ పాటిస్తూ వచ్చా..**

భారాస నాకు వ్యతిరేకంగా ఎన్నడూ క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమించలేదు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అసెంబ్లీలో మాట్లాడుతూ తమ బలం 38 ఉన్నట్లు ప్రకటించారు. పైగా నేను భారాస శాసనసభాపక్ష సభ్యత్వ ఫీజును నిరంతరం చెల్లిస్తూ వస్తున్నా. దీన్నిబట్టి భారాస నన్ను నిరంతరం తమ క్రియాశీలకసభ్యుడిగానే గుర్తిస్తూ వచ్చినట్లు స్పష్టమవుతోంది. నేను పార్టీకి రాజీనామా చేయలేదు. అసెంబ్లీలో భారాస శాసనసభాపక్షం జారీచేసిన ఆదేశాలన్నింటినీ పాటిస్తూ వచ్చా. అందుకే స్పీకర్ ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం నాకు వ్యతిరేకంగా దాఖలైన అనర్హత పిటిషన్‌ను కొట్టేస్తూ 10వ షెడ్యూల్‌లోని పేరా 6 కింద తీర్పు ఇచ్చారు. దాన్ని సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు డా.మహాచంద్రప్రసాద్ సింగ్ వర్సెస్ ఛైర్మన్, బిహార్ లెజిస్లేటివ్ కౌన్సిల్ కేసులో సుప్రీంకోర్టు

-5 లో

# జూరాల నీటి విడుదలకు రైతుల ఆందోళన

- భారాస పిలుపుతో ప్రాజెక్టు వద్దకు భారీగా చేరిక
- సొంతంగా నీటి విడుదలకు యత్నం
- పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట



పీజేపీ సమాంతర కాల్వ నీటిలో దిగి ప్రధాన ఎడమకాల్వ వైపు వెళ్తున్న రైతులు

**హైదరాబాద్ పెన్ పవర్:** జూరాల జలాశయం ఆయకట్టు రైతులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో సోమవారం ప్రాజెక్టు వద్ద ఉత్కంఠ నెలకొంది. ప్రధాన ఎడమకాల్వ ద్వారా నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలనే డిమాండుతో భారాస ఇచ్చిన పిలుపుమేరకు అన్నదాతలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు జూరాలకు వివిధ మార్గాల్లో తరలివచ్చారు. దీంతో పోలీసులు ప్రాజెక్టు మొత్తాన్నీ తమ అధీనంలోకి తీసుకున్నారు. పీజేపీ నందిమల్ల క్యాంపు వద్ద పోలీసులు రహదారికి అడ్డంగా బారికేడ్లను పెట్టగా.. రైతులు తోసుకువెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య తోపులాట చోటు చేసుకుంది. అమరచింత, ఆత్మకూరు మండలాల నుంచి వచ్చిన రైతులు ప్రధాన కుడికాల్వ వద్ద ఆందోళనలు నిర్వహించారు. డీఎస్పీ గిరిబాబు, సీఐ శివకుమార్, ఎస్సైలు వారితో చర్చలు నిర్వహించినా వినలేదు. ఓ దశలో పీజేపీ నందిమల్ల క్యాంపు వద్ద రైతులు సమాంతర కాల్వ వద్దకు వెళ్లి, అక్కడి నుంచి పీజేపీ డ్యామ్ పైకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కొందరు రైతులు సమాంతర కాల్వలోకి దిగి ఆందోళన చేపట్టారు. ఆత్మకూరుకు చెందిన భారాస నాయకుడు శ్రీనివాసులు పోలీసుల నుంచి తప్పించుకుని ప్రధాన ఎడమ కాల్వ హెడ్‌రెగ్యులేటర్ పైకి దూసుకెళ్తుండగా పోలీసులు అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఆత్మకూరు మండలం గుంటిపల్లి గ్రామానికి చెందిన రైతు వెంకటేశ్ హెడ్ రెగ్యులేటర్ గేట్ల వైపు వెళ్లే ప్రయత్నంలో జారిపడటంతో చేతి మణికట్టు విరిగింది. పోలీసులు తమ వాహనంలోనే ఆయనను ఆసుపత్రికి తరలించారు.

-5 లో

# దండం పెడతా సాగునీరివ్వండి



**హైదరాబాద్ పెన్ పవర్:** జిల్లా మంత్రులు, ప్రభుత్వానికి దండం పెడతానని, జూరాల ఆయకట్టు రైతులకు సాగునీరివ్వాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన జూరాల ప్రాజెక్టు వద్దకు వెళ్లకుండా పోలీసులు వనపర్తిలో గృహ నిర్బంధం చేశారు. దీంతో ఆయన మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. 'ప్రభుత్వం మంచినీటి పేరు చెప్పి పంటలకు సాగునీరివ్వకుండా ఘోష పెడుతోంది. ప్రస్తుతం జూరాలలో 9 టీఎంసీల నీళ్లున్నాయి. తాగునీటికి 2 టీఎంసీలు సరిపోతాయి. మిగిలిన 7 టీఎంసీలు రైతులకు వినియోగించాలి. ప్రభుత్వం ప్రకటించినట్లు కనీసం వారబందీ ద్వారా విడుదల చేసి రైతులను ఆదుకోవాలి. జూరాల జలాశయం ద్వారా ఇప్పటివరకు 200కు పైగా టీఎంసీల నీరు దిగువకు వెళ్లగా.. అందులో 18 టీఎంసీలు మాత్రమే ప్రభుత్వం వినియోగించుకుంది. శ్రీశైలం నుంచి ఏపీ ప్రభుత్వం 100 టీఎంసీల కృష్ణాజలాలను తరలించుకుపోయింది. నీటిని విడుదల చేయకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే లక్షల మంది రైతులతో జూరాలను ముట్టడించి నీటిని విడుదల చేస్తాం' అని హెచ్చరించారు.

# మహిళా 'సిఎంసి కార్మికుల'కు.. చీరల పంపిణీ..

- అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్న వారాల వినోద్ కుమార్..
- స్థానిక నాయకులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..





**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, సెప్టెంబర్ 21:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, 292 డివిజన్ సాయిబాబా నగర్, సూరారం కాలనీ పరిధిలోని పలు బస్తీలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద సోమవారం అన్న ప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా మండపాల నిర్వాహకులు, యువకుల ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.. అనంతరం పలు మండపాల వద్ద నిర్వహించిన అన్న ప్రసాద కార్యక్రమాల్లో పాల్గొని భక్తులతో కలిసి ప్రసాదాన్ని స్వీకరించారు.. ఈ సందర్భంగా 'సిఎంసి మహిళా కార్మికులకు' చీరలను పంపిణీ చేశారు.. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు రాజ్ కుమార్ ముదిరాజ్, దారం సాయి గుప్తా, గట్టు అశోక్, లక్ష్మణ్, మనీ, గౌస్, సత్యనారాయణ గౌడ్, కిషోర్ ముదిరాజ్, పూర్ణచందర్ రెడ్డి, మాజీద్ పాషా, ఫోటో స్టూడియో సంజీవ్, నరసింహ, గణేష్, పవన్, బిక్షపతి, శ్రీను తదితరులు పాల్గొన్నారు. స్థానికులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శ..



- శంకర్, రామ్‌రెడ్డిలను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా..
- కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పిన వినోద్ కుమార్..
- వినోద్ వెంట పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు..



**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, సెప్టెంబర్ 21:**సాయిబాబా నగర్ 292వ డివిజన్ పరిధిలోని తెలుగు తల్లి నగర్‌కు చెందిన శంకర్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వారాల వినోద్ కుమార్ సోమవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు.. అనంతరం కృషి కాలనీ బీఆర్ఎస్ అధ్యక్షుడు రామ్‌రెడ్డి ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చిన విషయం తెలుసుకున్న వారాల వినోద్ కుమార్ ఆయనను కూడా పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ పరామర్శ కార్యక్రమంలో రాజ్‌కుమార్ ముదిరాజ్, కృషి కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, పూర్ణచందర్ రెడ్డి, కిషోర్ ముదిరాజ్, నరసింహ, వేణు ముదిరాజ్, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# సిలబస్ మార్పుపై టీజీపీఎస్సీ కీలక ప్రకటన.. అభ్యర్థులకు ఊరట

-3 పేజి తరువాయి

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కీలక స్పష్టతనిచ్చింది. పోటీ పరీక్షల సిలబస్‌లో మార్పులు చేస్తారంటూ గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న వదంతులకు కమిషన్ తెరదించింది. సిలబస్ మార్పుపై అభ్యర్థుల నెలకొన్న ఆందోళనలు, వారి నుంచి వెల్లువెత్తుతున్న వినతుల నేపథ్యంలో టీజీపీఎస్సీ ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది.

సిలబస్ సమీక్ష కోసం ప్రస్తుతానికి ఎలాంటి కమిటీని ఏర్పాటు చేయలేదని టీజీపీఎస్సీ కార్యదర్శి స్పష్టం చేశారు. భవిష్యత్తులో పోటీ పరీక్షల సిలబస్‌లో ఏవైనా భారీ మార్పులు చేపట్టాల్సి వస్తే, ఆ విషయాన్ని కనీసం ఏడాది ముందే అభ్యర్థులకు తెలియజేస్తామని హామీ ఇచ్చారు. తద్వారా అభ్యర్థులు మారిన సిలబస్‌కు అనుగుణంగా సిద్ధమవడానికి తగిన సమయం లభిస్తుందని పేర్కొన్నారు.

అదేవిధంగా, ఏవైనా స్వల్ప మార్పులు లేదా చేర్పులు అవసరమైతే, ఆ వివరాలను సంబంధిత ఉద్యోగ నియామక నోటిఫికేషన్‌తో పాటే వెల్లడిస్తామని వివరించారు. సిలబస్ మార్పుపై అభ్యర్థులు అనవసరంగా ఆందోళన చెందవద్దని, అసత్య ప్రచారాలను నమ్మవద్దని ఈ సందర్భంగా సూచించారు. కమిషన్ ఇచ్చిన ఈ స్పష్టతతో లక్షలాది మంది నిరుద్యోగ అభ్యర్థులకు ఊరట లభించినట్లయింది.

# సీఎం రేవంత్ రెడ్డి ఆఖరి అస్త్రం.. గులాబీ బాస్ కొత్తవ్యూహం ఏమిటి?

**మెదక్, సెప్టెంబర్ 21, పెన్ పవర్:** కేసీఆర్ సభకు వస్తారు. కానీ సీఎంగానే అసెంబ్లీలో అడుగు పెడుతారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పిన మాట ఇది. చిల్లర మాటలు మాట్లాడే వారి ముందుకొచ్చి తాను సభలో పాల్గొనాలా.? అంటూ గులాబీ బాస్ కూడా సభకు రాబోనని తేల్చి చెప్పేశారు. ఇన్నాళ్లు సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని డిమాండ్లు చేసినా..ఎన్ని ఎత్తులు వేసినా..ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను అసెంబ్లీకి రప్పించేందుకు చేసిన ప్రయత్నాలేవి ఫలించలేదు. అందుకే సీఎం రేవంత్‌రెడ్డి ఆఖరి అస్త్రాన్ని బయటికి తీశారన్న ప్రచారం నడుస్తోంది. ఎలాగైనా కేసీఆర్ నోరు తెరిపించాలి.. ఆయనతో వివరణ ఇప్పించాలనేదే రేవంత్ టార్గెట్ అని..అందుకోసం ఏ అవకాశాన్ని ఆయన వదులుకోవడం లేదంటున్నారు.ఆ మాట కొస్తే కొత్త కొత్త పొలిటికల్ వెపన్స్‌ను బయటికి తీస్తూ కేసీఆర్‌ను టార్గెట్ చేస్తున్నారు. ఇప్పుడు ఆయన ఫాంహౌస్ ల్యాండ్స్‌లో దళితుల భూమి ఉందంటూ ఏకంగా విచారణకు ఆదేశించారు. ఆల్రెడీ ఎంక్వైరీ జరుగుతోంది. రెవెన్యూ అధికారులు ఫీల్డ్ విజిట్ కూడా చేశారు. అదంతా అడ్మినిస్ట్రేషన్ ప్రాసెస్ కాగా .. కాంగ్రెస్ ఎంపీలు కేసీఆర్ ఫాంహౌస్ పరిశీలనకు వెళ్లడం మరో రాజకీయ ఎత్తుగడ అన్న టాక్ నడుస్తోంది. ఎంపీలు వెళ్లి అక్కడ చేసేదేం లేదని..జస్ట్ మీడియాలో హైప్ కోసం..కేసీఆర్ ఆస్తులు సంపాదించారని ఎక్స్‌పోజ్ చేసే ఎజెండాలో భాగంగానే ఫాంహౌస్ పర్యటన పెట్టుకున్నారని అంటున్నారు.ప్రతీసారి వన్స్ మోర్ అంటూ కేసీఆర్‌కు ఓపెన్ ఛాలెంజ్ చేస్తూ వస్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి. పదేళ్ల పాలనలో తెలంగాణకు బీఆర్ఎస్ ఏం చేసిందో..కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో ఏం జరిగిందో..అసెంబ్లీలో ప్రజల ముందే చర్చిద్దామంటూ ఆ మధ్య సవాల్ చేశారు రేవంత్. చర్చలో తాను ఓడిపోతే ప్రజలకు క్షమాపణ చెబుతానని..కేసీఆర్ ఓడిపోతే ఫాంహౌస్‌కే పరిమితం అవుతారా అని ఛాలెంజ్ చేసిన సందర్భాలున్నాయి. కేసీఆర్ సభకు వస్తే ఆయన గౌరవానికి భంగం కలగకుండా చూసుకునే బాధ్యత కూడా తనదంటూ చెప్పుకొచ్చారు.ఇదంతా ఓ ఎత్తు అయితే..ఓ వైపు ఫోన్ ట్యాపింగ్ కేసు..ఇంకోవైపు విద్యుత్ కొనుగోళ్లపై విచారణ.. మరోవైపు కాళేశ్వరం దర్యాప్తు..ఇలా రకరకాల ఇష్యూస్‌తో కేసీఆర్ మౌనాన్ని బద్దలు కొట్టే ప్రయత్నం చేశారు సీఎం. అయినా నో కామెంట్ అంటూ సైలెంట్‌గా ఉంటూ వచ్చారు కేసీఆర్. ఫాంహౌస్‌లో నేతలతో భేటీ



అయినా..పబ్లిక్ మీటింగ్‌లకు అటెండ్ అయినా..ఎక్కడా రేవంత్ పేరు తీయకుండానే ఈ ప్రభుత్వ పనితీరు బాలేదని..ప్రజలు సంతోషంగా లేరని చెప్పుకొంటూ వస్తున్నారు కేసీఆర్. దీంతో ఇన్నాళ్లు రేవంత్ వేసిన ఎత్తులేవి వర్కౌట్ కాలేదు. ప్రభుత్వం, సీఎం రేవంత్ చేసిన ఏ ఆరోపణపై కేసీఆర్ బయటికి వచ్చి రియాక్ట్ కాలేదు. ఈ నేపథ్యంలోనే రేవంత్ ఫైనల్ పంచ్ ఇచ్చేందుకు ఫాంహౌస్ ల్యాండ్స్ చుట్టూ ఎంక్వైరీ అంటూ రచ్చకు తెరలేపారని అంటున్నారు.అధికార పార్టీ నుంచి ఎన్ని విమర్శలు వచ్చినా..రేవంత్‌రెడ్డి ఎన్నిసార్లు కేసీఆర్ను ఉద్దేశించి పర్సనల్ అటాక్ చేసినా..దమ్ముంటే అసెంబ్లీకి రావాలని సవాల్ చేసినా..గులాబీ బాస్ రియాక్ట్ అయిన దాఖలాలు లేవు. సీఎం రేవంత్ రెడ్డి పేరును కూడా ప్రస్తావించకుండా కేసీఆర్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారన్న ఒపీనియన్స్ ఉన్నాయి. సీఎం రేవంత్, కాంగ్రెస్ నేతలు అలిగేషన్స్‌కు సమాధానం చెప్పే బాధ్యతను కేటీఆర్, హరీశ్‌రావులే తీసుకుంటున్నారు. రేవంత్ రెడ్డి స్థాయికి తామే సరిపోతామ్..కేసీఆర్ స్పందించాల్సిన అవసరం లేదని వాళ్లిద్దరే రివర్స్ అటాక్‌కు దిగుతున్నారు.కానీ రేవంత్ టార్గెట్ ఒక్కటే. కేసీఆర్ నోరు తెరిపించాలి. తన పేరు ప్రస్తావించి మాట్లాడే పరిస్థితి తీసుకురావాలి. అన్నింటికి మించి రేవంత్ వర్సెస్ కేసీఆర్ అన్నట్లుగానే తెలంగాణ పొలిటికల్ సినారియోలో డైలాగ్ వార్ కొనసాగాలనేది రేవంత్ మాస్టర్ ప్లాన్ అంటున్నారు. అందుకే సందర్భం దొరికిన ప్రతీసారి కేసీఆర్‌ను టార్గెట్ చేస్తూ వస్తున్నారని అంటున్నారు. సరిగ్గా ఎన్నికలకు ఏడాది ముందు కేసీఆర్ రంగంలోకి దిగాలని..అదే తమ ఎన్నికల అస్త్రమని బీఆర్ఎస్ భావిస్తోంది. అదే జరిగితే ఎన్నికల్లో కేసీఆర్‌కు సానుభూతి వచ్చే అవకాశం ఉంటుందని.. ఆలోపే కేసీఆర్ నోరు తెరిపించాలని రేవంత్ ప్లాన్ అని అంటున్నారు. దీంతో ఈ ఇద్దరి పోరాటం.. రసవత్తరంగా మారుతోంది.మరి ఈ సారి రేవంత్ వేసిన ల్యాండ్ ఎంక్వైరీపై కేసీఆర్ స్పందిస్తారా.? రేవంత్ ఫైనల్ పంచ్‌కు కేసీఆర్ మౌనం వీడుతారా.? ఇప్పటివరకు అనుసరిస్తున్న వ్యూహాన్నే కొనసాగిస్తారా.? ఇదే ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఇంట్రెస్టింగ్ టాపిక్‌గా మారింది. ఒకవేళ కేసీఆర్ స్పందిస్తే..కాంగ్రెస్–బీఆర్ఎస్ మధ్య రాజకీయ సమరం కొత్త మలుపు తిరిగే అవకాశం ఉంది. స్పందించకపోతే..బ్లేమ్ గేమ్ వెపన్‌గా మలుచుకునేందుకు హస్తం పార్టీ రెడీ అవుతోంది. రేవంత్ లేవనెత్తిన ఈ ల్యాండ్ లడాయి ఎటు టర్న్ తీసుకుంటుందో చూడాలి మరి.

# మలక్ పేట్ లో పోలీస్ కానిస్టేబుల్ అనుమానాస్పద మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** మలక్ పేట్ లో పోలీస్ కానిస్టేబుల్ అనుమానాస్పద మృతి చెందాడు. మూసారాంబాగ్ శాలివాహన నగర్ లో ఘటన జరిగింది. కానిస్టేబుల్ ముత్తె చంద్రశేఖర్ (35) ఇంట్లో ఉరేసుకుని మృతి చెందాడు.అంబర్పేట్ హెడ్ క్వా ర్టర్స్ లో కానిస్టేబుల్ రైటర్ విధులు నిర్వహిస్తు?న్నాడు. అర్ధరాత్రి ఓ యువతికి వీడియో కాల్ చేసినట్లు సమాచారం. తాను ఉరేసుకుంటున్నట్లు యువతికి చెప్పినట్లు సమాచారం.

వెంటనే యువతి చైతన్యపురి పోలీసులకు సమాచారం అందించింది. చైతన్యపురి పోలీసుల సమాచారంతో మలక్ పే ట్ పోలీసులకు విషయం తెలియగానే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. కానిస్టేబుల్ మృతికి పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.

# తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం వద్ద ఎర్ర బ్యానర్తో కలకలం

**హైదరాబాద్ పెన్ పవర్:** మేడ్చల్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ కార్యాలయ గేటుకు ఎరుపు రంగు బ్యానర్లు కట్టడం కలకలం రేఆయి. గుర్తుతెలియని వ్యక్తులు హెచ్చరిక లేఖ అంటించారు. ఏపీటీహట?చ్ ఎఎ అలెగ్జాండర్ పేరుతో లేఖ, ఎర్ర బ్యానర్ ప్రత్యక్షమయ్యాయి. పది మంది విప్లవ యోధుల ఉరిశిక్షను ఖండిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్ పెన్ పవర్:** జూరాల ఆయకట్టుకు సాగునీరిచ్చి పంటలు కాపాడాలని రైతుల పక్షాన డిమాండ్ చేసిన ఉమ్మడి పాలమూరు జిల్లా బీఆర్ఎస్ నేతలను అక్రమంగా అరెస్టు చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలను, బీఆర్ఎస్ పార్టీ నేతలందరినీ అక్రమంగా నిర్బంధించడం రేవంత్ రాక్షస మనస్తత్వానికి నిదర్శనం. కళ్లముందే పంటలు ఎండిపోయి అల్లాడుతున్న అన్నదాతల గోసను ప్రభుత్వం తీర్చాల్సింది పోయి, న్యాయమైన డిమాండ్తో నిరసనకు సిద్ధమైన బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు రేవంత్ సర్కారు కుట్ర చేస్తోందని అన్నారు. సీఎంగా విఫలమైన రేవంత్ తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికే, జిల్లాలోని అనేక మండలాల్లో బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలకు చీకటి ఆదేశాలిచ్చాడు. జూరాల ప్రాజెక్టులో 9 టీఎంసీల నీటి లభ్యత ఉన్నా, నీళ్లను విడుదల చేయకుండా పనికిరాని కుంటిసాకులతో రేవంత్ సర్కారు పచ్చని పంటల ఉసురు తీస్తోంది. తమ పంటలను కాపాడుకునే ఏకైక తపనతో గుండెపగిలిన రైతులు జూరాల గేట్లు ఎత్తే ప్రయత్నం చేస్తే, వారిపై అక్రమ కేసులు బనాయించిన ప్రభుత్వం అన్నదాతలను అన్నివిధాలా అరిగోస పెడుతోంది. తెలంగాణ గడ్డపై ఉన్న జూరాల ప్రాజెక్టు పరిసరాల్లోకి రైతులు రాకుండా ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటుచేసి, వందలాది పోలీసులను చుట్టుపక్కల మోహరించడం ముమ్మాటికీ సిగ్గుమాలిన చర్య. తాగునీటికి కేవలం రెండు టీఎంసీలు సరిపోతాయని తెలిసినా, 9 టీఎంసీలున్న జూరాల నుంచి చుక్క నీరు విడుదల చేయకుండా ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టు రైతులను సంక్షోభంలోకి నెట్టడం క్షమించరాని పాపమని అన్నారు.అక్రమంగా అరెస్టు చేసిన బీఆర్ఎస్ నేతలను ప్రభుత్వం విడుదల చేయడంతో పాటు జూరాల ఆయకట్టు రైతులకు తక్షణమే సాగునీరు విడుదల చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం.. లేకపోతే అన్నదాతల ఆగ్రహానికి ఈ కాంగ్రెస్ సర్కారు కుప్పకూలడం ఖాయమని అన్నారు.

# ఆఘాజ్-ఎ-విరాసా'లో ఆభరణాల ప్రదర్శన

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ సాంస్కృతిక, రాజవం శ సంప్రదాయాల స్ఫూర్తితో రూపొందించిన హెరిటేజ్ జ్యువెలరీ హౌస్ 'విరాసా' ఘనంగా ప్రారంభమైంది. 'ఆఘాజ్–ఏ–విరాసా' పేరుతో ప్రత్యేక ఆభరణాల ప్రదర్శనను బంజారాహిల్స్లోని రాడిసన్ బ్లూ హోటల్, గ్రీనా వ్యాలీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి మహమూద్ అలీ ముఖ్యఅతిథిగా హాజరై బ్రాండ్ను ఆవిష్కరించారు. సంప్రదాయ ఆభరణాల కళాత్మకతను ఆధునిక డిజైన్ సౌందర్యంతో మేళవిస్తూ అమ్తుల్ సిద్దిఖీ విరాసాను స్థాపించారు. ఆభరణం కేవలం అలంకరణ మాత్రమే కాకుండా జ్ఞాపకాలు, వ్యక్తిత్వం, కుటుంబ వారసత్వాన్ని తరతరాలకు అందించే గుర్తుగా ఉండాలన్నదే విరాసా లక్ష్యమని అముల్ సిద్దిఖీ తెలిపారు. 'ఆఘాజ్–ఎ–విరాసా ప్రదర్శనలో భారతీయ వారసత్వం, రాజవంశ సంప్రదాయాల నుంచి స్ఫూర్తి పొందిన ఆభరణాలను ప్రదర్శించారు.

# బీసీలకు రాజ్యాధికారం దక్కకుండా కుట్రలు:

**జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు-రాజ్యసభ ఎంపీ ఆర్. కృష్ణయ్య**



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్:శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి

బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో సైతం రిజర్వేషన్లు కల్పించాలి,జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు–రాజ్యసభ ఎంపీ ఆర్ కృష్ణయ్య వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి బీసీలే పునాదిరాళ్లు అని, అలాంటి బీసీలకు రాజ్యాధికారం దక్కకుండా అగ్రవర్ణాలు కుట్రలు పన్నుతున్నాయని శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ఆరోపించారు. కాచిగూడలో జరిగిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ బీసీ ఉద్యోగ సంఘాల ప్రతినిధుల సమావేశానికి మధుసూదనాచారి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ. ప్రపంచాన్ని శాసించేది రాజ్యాధికారం, డబ్బేనని, అవి ఉన్నవారే నేటి సమాజంలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. బీసీలు ఎదగకుండా కులాల వారీగా విభజించి అణగదొక్కుతున్నారని, అందుకు వ్యతిరేకంగా బీసీలంతా ఏకమై ఉద్యామించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.'బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలి. ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలి. బీసీల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రీమిలేయర్‌ను తక్షణమే తొలగించాలి.

కేంద్రస్థాయిలో 2 లక్షల కోట్ల బడ్జెట్‌తో బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటుచేయాలి అని డిమాండ్ చేశారు. తెలంగాణ ఓబీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు దానకర్ణచారి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ సెక్రటరీ డాక్టర్. వడ్డేపల్లి హనుమంతు, రవికుమార్ ముదిరాజ్, రామరాజ్, అల్లం యాదయ్య, చెన్నయ్య, జీ మల్లేశ్, సీ రామమూర్తి, శ్రీశైలం, శ్రీనివాస్‌గౌడ్, ప్రదీప్, నగేశ్‌రాజ్, గౌతం, నీలం వెంకటేశ్, సీ రాజేందర్, నిఖిల్ పాల్గొన్నారు.

# 'ఓ పార్టీ ఎమ్మెల్యే మరో పార్టీ ఎంపీగా పోటీపై నిషేధం లేదు'

-3 పేజి తరువాయి

తీర్పును పరిగణనలోకి తీసుకొని నన్ను అనర్హుడిగా ప్రకటించింది.ఆ కేసులో మహాచంద్రప్రసాద్ మరోపార్టీ నుంచి పోటీచేయడాన్ని పదోషెడ్యూల్‌లోని పేరా 2(1)(ఏ) కింద స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వాన్ని వదులుకున్నట్లుగా భావించి సుప్రీంకోర్టు ఆయనపై అనర్హత వేటు వేసింది. అయితే ఆ తీర్పును ఈ కేసుకు ఆటోమేటిక్‌గా హైకోర్టు వర్తింపజేసింది. ప్రతి కేసునూ అందులో ఉన్న పరిస్థితుల ఆధారంగా ప్రత్యేకంగా చూడాలి తప్పితే సుప్రీంకోర్టు తీర్పులను ఆటోమేటిక్‌గా వర్తింపజేయకూడదు. ఇది మహాచంద్ర కేసుకు పూర్తి భిన్నం. నేను లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసిన తర్వాత కూడా భారాస సభ్యుడిగా కొనసాగా. 10వ షెడ్యూల్ కింద స్పీకర్ జారీచేసే ఉత్తర్వులను విస్తృతస్థాయిలో సమీక్షించే అధికారం ఆర్టికల్ 226 కింద హైకోర్టుకు లేదు. కేవలం మహాచంద్ర కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా అనర్హత వేటు వేయడం చట్టవిరుద్ధం" అని దానం నాగేందర్ పిటిషన్‌లో పేర్కొన్నారు.

**రేపు విచారణ**

దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టడానికి సుప్రీంకోర్టు అంగీకరించింది. పార్టీ ఫిరాయించారన్న కారణంగా రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ కింద ఎమ్మెల్యే పదవికి తనను అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఈ నెల 18న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ ఈ నెల 19న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనికున్న అత్యవసరతను దృష్టిలో ఉంచుకొని వెంటనే విచారణ చేపట్టాలని సోమవారం ఆయన తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్‌రోహత్గీ... ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యబాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనానికి విన్నవించారు.

"సిటింగ్ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా దాఖలైన అనర్హత పిటిషన్‌ను స్పీకర్ తిరస్కరిస్తే హైకోర్టు దాన్ని కొట్టేసింది. ఆ ఎమ్మెల్యే తమ పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నారని, అందువల్ల ఆయనపై అనర్హత వేటు వేయాలని కోరుతూ ఎవరో పిటిషన్ దాఖలు చేశారు తప్పితే ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ దాఖలు చేయలేదు. ఈ మధ్యలో ఆ స్థానానికి ఉప ఎన్నిక నోటిఫికేషన్ జారీ చేస్తే సమస్యగా మారుతుంది. అందువల్ల ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని మంగళవారం విచారణ చేపట్టండి" అని కోరారు. అందుకు ఈ కేసులో ప్రతివాదిగా ఉన్న భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది మహేశ్ జెఠ్మలానీ జోక్యం చేసుకుంటూ తమ వ్యక్తిగత కారణాలను దృష్టిలో ఉంచుకొని బుధవారం విచారణకు తీసుకోవాలని, ఈ విషయాన్ని తాను పిటిషనర్ తరఫు న్యాయవాది దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. ఇరువురి వాదనలను విన్న అనంతరం దీనిపై బుధవారం విచారణ చేపడతామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు.

# జూరాల నీటి విడుదలకు రైతుల ఆందోళన

-3 పేజి తరువాయి

రైతులు సమాంతర కాల్వ గేట్ల వద్దకు వస్తారని భావించిన పీజేపీ డివిజన్–5 అధికారులు ఈఈ మహేందర్, డీఈ జయశ్రీ సిబ్బందితో కలిసి కాల్వకు సంబంధించిన గేటు లోపలే కాపలాగా కూర్చున్నారు. అంతకు ముందు మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి రైతులతో కలిసి ప్రాజెక్టు వద్దకు వెళు ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఆయనను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తీసుకెళ్తుండగా రైతులు, నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని పక్కకు తోసి రామ్మోహన్‌రెడ్డిని కొత్తకోట ఠాణాకు తరలించారు. .

**డీకే అరుణ అడ్డగింత**

కోయిలసాగర్ నుంచి సాగునీటి విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మరికల్ మండల కేంద్రంలోనూ రైతులు ఆందోళన చేశారు. ఈ సమయంలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు మక్తల్ వెళ్తూ మరికల్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో భారాస నాయకులు, కార్యకర్తలు ఎంపీ కారు చుట్టూ చేరి.. సాగునీటిని వదిలేందుకు మీ వంతు కృషి చేయాలని కోరుతూ నినాదాలు చేశారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆమె కారులో నుంచే ఆందోళనకారులకు నచ్చజెప్పారు.

# సర్కారు దవాఖానాలో దారుణం: శవాన్ని పీక్కుతిన్న ఎలుకలు

**హైదరాబాద్ పెన్ పవర్:** వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో అమానుషం.. ఫ్రీజర్ లేకపోవడంతోనే ఘోరం.రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ తీరుకు అద్దం పడుతూ వర్ధన్నపేట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో దిగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది.మార్చురీలో భద్రపరిచిన మృతదేహాన్ని ఎలుకలు కొరికి తినడం తీవ్ర కలకలం రేపింది.

వరంగల్ జిల్లాకు చెందిన గారె వీరయ్య శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.శవపంచనామా మరియు పోస్టుమార్టం నిమిత్తం శనివారం రాత్రి ఆయన మృతదేహాన్ని వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఆదివారం ఉదయం పోస్టుమార్టం కోసం కుటుంబ సభ్యులు వెళ్లగా, మృతదేహంపై కంటి భాగాలను ఎలుకలు పీక్కుతిన్న ఆనవాళ్లు కనిపించాయి.మార్చురీ గదిలో మృతదేహాలను భద్రపరిచేందుకు కనీస వసతులు, ఫ్రీజర్ సౌకర్యం లేకపోవడం వల్లే ఈ ఘోరం జరిగిందని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుద్ధ్య లోపం, సిబ్బంది నిర్లక్ష్యంపై స్థానికులు, ప్రజా సంఘాలు మండిపడ్డారు.తక్షణమే ఆసుపత్రిలో ఆధునిక వసతులు, ఫ్రీజర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆసుపత్రి ప్రాంగణంలో ఆందోళనకు దిగారు.

### వినాయక చవితి లడ్డు వేలం - కాలనీవాసులు అభినందనలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉమ్మడి మెదక్ జిల్లా పటాన్చెరు నియోజకవర్గంలోని వినాయక చవితి సందర్భంగా నిర్వహించిన లడ్డు వేలం కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో పాల్గొని, పాటలు పాడుతూ భక్తి భావాన్ని చాటిన ఇద్దరు భక్తులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. సౌకత అలీ 40,000/- రూపాయలకు విగ్నేశ్వరుని లడ్డు దక్కించుకున్నారు. సౌకత అలీ భక్తి, సేవాభావంతో లడ్డు వేలంలో ఉత్సాహంగా పాల్గొని, 40,000/- కు లడ్డును వేలంలో పాట పాడి దక్కించుకున్నారు వారి భక్తి, దాతృత్వం మరియు కార్యక్రమం పట్ల చూపిన ఆసక్తి అభినందనీయం. బి. నాగరాజు 21,000/- బి. నాగరాజు. కూడా భక్తిశ్రద్ధలతో వేలంలో పాల్గొని, 21,000/-కు లడ్డును పాట పాడి తీసుకున్నారు. వినాయకునిపై ఉన్న భక్తిని చాటుతూ, ఈ పవిత్ర కార్యక్రమానికి తమ వంతు సహకారం అందించినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు వీరిరువురికీ హృదయపూర్వక అభినందనలు మరియు ప్రత్యేక ధన్యవాదాలు. కాలనీవాసులు వినాయక బృందం ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అలాగే మొదటి లడ్డు దక్కించుకున్న సౌకత అలీ కి, నాగరాజు గార్లకు మరియు ఈ పవిత్ర కార్యక్రమంలో భాగస్వాములైన ప్రతి ఒక్క భక్తుడికి, వారి కుటుంబ సభ్యులందరికీ శ్రీ వినాయకుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా వీరిని భక్తమండలి కోరుకున్నారు. వారి కుటుంబాలలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, ఆనందం నిండాలని.. శ్రీ విఘ్నేశ్వరుని కృపతో ప్రతి కార్యంలో విజయం చేకూరాలనీ అందరికీ శుభం, మంగళం కలగాలని.. గణపతి బప్పా మోరియా! అనే నివాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తమండలి మరియు తదితరులు పాల్గొన్నారు.

## హలో ముదిరాజ్ చలో సిరిసిల్ల
## "26"న ముదిరాజ్ సింహ గర్జన మహాసభ



**రాజన్న సిరిసిల్ల పెన్ పవర్:** ఇల్లంతకుంట మండల కేంద్రం లోని మండల ముదిరాజ్ సంఘం లో ఏర్పాటు చేసిన ముదిరాజ్ సొసైటీ కమ్యూనిటీ సభ్యుల సమావేశం జరిగింది ఈ సమావేశంలో ఈ నెల 26వ తారీఖున హలో ముదిరాజ్- చలో సిరిసిల్ల ముదిరాజ్ సింహ గర్జన సభను విజయవంతం చేయవలసిందిగా కోరడం జరిగింది ఈ సభ ముఖ్య ఉద్దేశం ఆనాటి కాలం నుండి ముదిరాజులు వెనుకబాటు తనానికి మరియు హక్కుల సాధనకు ఈ సభను ఏర్పాటు చేస్తున్నట్టు రాబోయే కాలాలలో ముదిరాజులను రాజకీయంగా ఉద్యోగపరంగా అవకాశాలను కల్పించడానికి రిజర్వేషన్లు (బీసీ - డి నుండి బీసీ - ఏ) లోకి మార్చాలని , ముదిరాజ్ మత్స్య కారులకు వయస్సు 50"స0!! నిండిన ప్రతి ముదిరాజ్ సభ్యునికి పెన్షన్ వచ్చే విధంగా ప్రభుత్వం వెంటనే కృషి చేయాలని ముదిరాజుల బాణీని వినిపించడానికి ఈనెల ౹ 26న సిరిసిల్ల ముదిరాజ్ సింహ గర్జనరి సభకు ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా తెలిపారు ఈసమావేశంలో ముదిరాజ్ ఇల్లంతకుంట ఫిషరీస్ సొసైటీ అధ్యక్షులు కూనబోయిన బాలరాజు ముదిరాజ్, ఉపాధ్యక్షులు రఘు ముదిరాజ్, ముదిరాజ్ సంఘం -1 అధ్యక్షులు కూనబోయిన దేవయ్య ముదిరాజ్, సొసైటీ ట్రెజరర్ రెగుల కార్తీక్ ముదిరాజ్, ఎంద్ర భుచ్చయ్య, ముదిరాజ్ సభ్యులు కూనబోయిన కనుకయ్య ముదిరాజ్, కునబోయిన రాజు, కూనబోయిన సుధాకర్, కునబోయిన కనుకయ్య, కూనబోయిన బాలరాజు, రేగుల అనీల్, కునబోయిన బాలరాజు, కునబోయిన కార్తీక్, కునబోయిన పరశురాం, కునబోయిన రాజు, ఎంద్ర రవి, ఎంద్ర నరేష్, కునబోయిన రాజు, కూనబోయిన శేఖర్, కునబోయిన కనుకరాజు , గంగు రాజు ముదిరాజ్ సభ్యులు పాల్గొన్నారు

## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం.

### గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 19 ఫిర్యాదులు స్వీకరణ

### జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.

**రాజన్న సిరిసిల్ల: పెన్ పవర్:** ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. సోమవారం రోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 19 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..... ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# అర్హత లేని వ్యక్తి వైద్యం.. అజయ్ క్లినిక్ సీజ్

**హైదరాబాద్ పెన్ పవర్:** నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్నారన్న ఆరోపణలతో హయత్ నగర్‌లోని అజయ్ క్లినిక్‌ను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సోమవారం సీజ్ చేశారు. రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. స్వర్ణకుమారి ఆదేశాల మేరకు డెమో గంగాసాని మంజుల, డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. సత్యరత్న, మెడికల్ ఆఫీసర్ డా. ప్రియాంక, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది క్లినిక్‌ను తనిఖీ చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అజయ్ క్లినిక్ డా. సరిత పేరుతో రిజిస్టర్ అయి ఉంది. రిజిస్ట్రేషన్ గడువు ముగియడంతో ఆమె రెన్యువల్ కోసం డీఎంహెచ్‌వో కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఆమె అందుబాటులో లేని సమయంలో అర్హత లేని వ్యక్తి క్లినిక్‌లో వైద్యం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో క్లినిక్‌ను సీజ్ చేశారు. జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా, అర్హతకు మించి వైద్య సేవలు అందిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో డా. స్వర్ణకుమారి హెచ్చరించారు.




## స్కేటింగ్ పోటీల్లో సీఎంఆర్ స్కూల్ బొల్లారం విద్యార్థుల సత్తా




10 పతకాలు కైవసం.. 8 బంగారు పతకాలతో అదరగొట్టిన విద్యార్థులు

**హైదరాబాద్ పెన్ పవర్:** )బొల్లారం పల్లవి మోడల్ స్కూల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్--12, అండర్--14 స్థాయి స్కేటింగ్ పాఠశాలల పోటీల్లో సీఎంఆర్ స్కూల్ బొల్లారం విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. వివిధ విభాగాల్లో పోటీపడి మొత్తం10 పతకాలు సాధించారు.ఇందులో 8 బంగారు,ఒక వెండి,ఒక కాంస్య పతకం ఉన్నాయి.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి లావణ్య విజేతలను అభినందిస్తూ, వారి విజయంపై హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రతిభకు డైరెక్టర్ శ్రీమతి అనురాధ మార్గదర్శకత్వం,కరస్పాండెంట్, చైర్‌పర్సన్ శ్రీమతి సౌజన్య రెడ్డి, చైర్మన్ సి.హెచ్. శ్రీశైలం రెడ్డి సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు.విద్యార్థులను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
విద్యార్థులకు నిరంతరం కఠినమైన శిక్షణ అందిస్తూ, పోటీలకు సిద్ధం చేయడంలో కృషి చేసిన శారీరక విద్యా ఉపాధ్యాయుడు దత్తాత్రి సర్‌ను ప్రిన్సిపాల్ లావణ్య ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలన్న ఆయన అంకితభావం, కృషి ప్రశంసనీయమని తెలిపారు.

## ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

### మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఐఏఎస్



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఐఏఎస్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తో కలిసి కలెక్టర్ అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, సివిల్ సప్లైస్,మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 106 దరఖాస్తులు ప్రజల నుండి స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి వేగంగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంటనె నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు.ఈ సమావేశంలో డిఆర్ఓ మాలతి,వివిధ శాఖల జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు







శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**హైదరాబాద్ పెన్ పవర్:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాప్రా మండల్ జవహర్ నగర్ చంద్రపురి కాలనీ గబ్బిలాల పేట లో వినాయక చతుర్థి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలలో భాగంగా గణనాధునికి ప్రత్యేక పూజలతో పాటు ఆటపాటలతో రోజుకు ఒక్కొక్క కార్యక్రమం నిర్వహిస్తూ అందులో భాగంగానే ఆడపడుచులకు సైతం ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి కార్మెల్ స్కూల్ ప్రిన్సిపల్ లావణ్య పాల్గొని విజేతలను ప్రకటించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అనూష ,హారిక, కవిత ,పద్మ, పూజిత, వర్షిత, మమత, విజయ, శ్రీ వాణి ,మరియు లావణ్య తదితరులు పాల్గొనడం జరిగింది.

### గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి: డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సంతోష్..




**హైదరాబాద్ పెన్ పవర్:** గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సూచించారు. హయత్ నగర్ పాత గ్రామంలోని శ్రీచక్ర సహిత మహమ్మాయి రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'గణేష్ సురక్ష సంకల్పం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. ఉత్సవాల సందర్భంగా ప్రజల భద్రతకు పోలీస్ శాఖ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసుల సూచనలు పాటించి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. మహిళల భద్రతకు అందరూ బాధ్యత వహించాలని, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా షీ టీమ్స్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ మాట్లాడుతూ.. మహిళల భద్రత, షీ టీమ్స్ సేవలు, పోలీస్ శాఖ అందిస్తున్న రక్షణ చర్యలను వివరించారు. మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మీనారాయణ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

### సీఎం రిలీఫ్ ఫండ్ పేదలు వినియోగించుకోవాలి
### అస్మాత్ పూర్ సర్పంచ్ మంథని శివ యాదవ్..
### సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ..




**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని ప్రజాప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని సర్పంచ్ మంథని శివ యాదవ్ అన్నారు. సోమవారం రోజున అస్మాత్ పూర్ గ్రామంలో సర్పంచ్ మంథని శివ యాదవ్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అస్మత్ పూర్ గ్రామంలోని లబ్ధిదారులు మందం కుమార్, బూడిద మల్లయ్య, ఉల్లింతల ప్రేమలత లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కొరకు అనేక పథకాలు తీసుకొచ్చిందని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో నియోజకవర్గం అభివృద్ధిలో ముందంజలో ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మందం ప్రభాకర్, అశ్వల రాజు, కిరణ్, కార్తీక్, కళ్ళ జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## గార్లను కరువు మండలంగా ప్రకటించాలి




ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

**గార్ల, పెన్ పవర్ , సెప్టెంబర్ 21 :** వర్షాభావ పరిస్థితులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గార్ల మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని సీపీఎం నాయకులు సీపీఎం జిల్లా నాయకులు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల సత్యవతి,లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు.
మండలంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతుల పరిస్థితిపై సమగ్రంగా అంచనా వేయాలని నాయకులు కోరారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం తక్షణ ఉపశమన చర్యలు చేపట్టాలని, కరువు మండలంగా ప్రకటించేందుకు అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు అండగా నిలిచేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని కోరారు.అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు సమర్పించారు. గార్ల మండల పరిస్థితిని ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుని రైతులకు న్యాయం చేయాలని కోరారు.ఈకార్యక్రమంలో సీపీఎం నాయకులు , అంబటి వీరస్వామి, పెద్ద వెంకటేశ్వర్లు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం పరబ్రహ్మ స్వరూపం



భక్తులకు అన్నదానం చేస్తున్న ఫ్రెండ్స్ యూత్ సభ్యులు

**గార్ల, పెన్ పవర్, సెప్టెంబర్: 21 :** అన్ని దానాల కంటే అన్నదానం ఎంతో గొప్పదని ఫ్రెండ్స్ యూత్ సభ్యులు ఉపేందర్ పి ఎల్ నారాయణ లు అన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గార్ల మండల కేంద్రంలోని స్థానిక పుట్టకోట బజార్ లో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద ఫ్రెండ్స్ యూత్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పార్వతి నాయక్ హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు భోజనాలు వడ్డించారు అనంతరం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని దానాల కంటే అన్నదానం గొప్పదని అన్నదానం చేయడం వల్ల వేయి జన్మల పుణ్యఫలం తో సమానం మన్నారు గణేష్ నవరాత్రి ఉత్సవాల లో భాగంగా నిర్వహించే అన్నదానంతో ఎంతోమంది పేదల ఆకలి తీరుతుందన్నారు గ్రామస్తులు సోదరా భావంతో కలిసిమెలిసి ఉత్సవాలను జరుపుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా చేపట్టిన రీవేరా ఫంక్షన్ హాల్ పై చర్యలు తీసుకోండి

### ఉప్పరిగూడ ఉపసర్పంచ్ ఎన్ను కావ్య వెంకట్ రెడ్డి



అదనపు కలెక్టర్ కు అందజేస్తున్న దృశ్యం

**ఇబ్రహీంపట్నం, పెన్ పవర్, సెప్టెంబర్ 21:** ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించి, గ్రామ పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్న రీవేరా ఫంక్షన్ హాల్ పై చర్య తీసుకోవాలని ఉప్పరిగూడ గ్రామ ఉపసర్పంచ్ ఎన్ను కావ్య వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో వార్డు సభ్యులు నర్కుడి మహేందర్, కొంగరి రవితేజ తో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఇబ్రహీంపట్నం ఖల్సా (ఉప్పరిగూడ గ్రామం) రెవెన్యూ పరిధి, సీవీఆర్ కళాశాల సమీపంలో "రీవేరా ఫంక్షన్ హాల్" కు ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించారని, పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు చెప్పిన పట్టించుకోకుండా, నిర్లక్ష్యం వహించారని అన్నారు. ఇటీవలా ఇదే అంశంపై ఇబ్రహీంపట్నం మండలంలోని ప్రజావాణిలో కూడా ఫిర్యాదు చేసినప్పటికీ, ఎలాటి చర్యలు తీసుకోలేదన్నారు. కావున, ఇప్పటికైనా అధికారులు స్పందించి, ప్రభుత్వ నిబంధనలు బేఖాతర్ చేస్తూ, నడుపుతున్న ఈ రీవేరా పంక్షన్ హాల్ పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## కారులో ఊపిరాడక చిన్నారి మృతి

**భద్రాద్రి కొత్తగూడెం పెన్ పవర్:** ద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విషాద ఘటన జరిగింది. కారు లాక్ అవ్వడంతో ఊపిరాడక నాలుగేళ్ల చిన్నారి మృతి చెందింది. జూలూరుపాడు మండలం వినోభానగర్ గ్రామ సర్పంచ్ నవీన్, ఐశ్వర్య దంపతులకు ఇద్దరు పిల్లలు తన్విత్రశ్రీ (4), సురక్ష. ఆదివారం స్కూలుకు సెలవు కావడంతో, ఇంటి వద్ద ఆడుకుంటూ లాక్ చేయని కారులో తన్వితశ్రీ ఎక్కింది. కారు ఎక్కగానే కారు లాక్ అవ్వడంతో, కాసేపటికి ఊపిరాడక చిన్నారి స్పృహ తప్పింది. కాసేపటికి కూతురు కనిపించడంలేదని తల్లి చెప్పడంతో ఊరంతా వెతికి, అనుమానంతో కారులో చూడగా స్పృహ తప్పి పడిపోయిన తన్వితశ్రీని గుర్తించి స్థానికులు బయటికి తీసారు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు.

# సుప్రీం కోర్టుకు దానం నాగేందర్ .. భయం వెనుక కథేంటి



**హైదరాబాద్, సెప్టెంబర్ 21, పెన్ పవర్:** పార్టీ ఫిరాయింపు ఆరోపణలతో తనను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పును మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. తీర్పు వచ్చిన వెంటనే సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన లేదని.. తాను ఫైటర్ నని, ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటానని అన్నారు. అంతలోనే ఏం జరిగిందో కానీ, మరుసటి రోజే తనకు న్యాయం చేయాలంటూ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. డైరీ నంబరు 58219/2026తో పిటిషన్ దాఖలు చేసిన ఆయన, ఇందులో బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని ప్రతివాదిగా చేర్చారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ పేరా 2(1)(ఎ), ఆర్టికల్ 191(2) కింద తనను అనర్హుడిగా ప్రకటించడం చట్టవిరుద్ధమని దానం నాగేందర్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.ఎమ్మెల్యేల అనర్హత అంశంలో అసెంబ్లీ స్పీకర్ తీసుకునే నిర్ణయాలను కోర్టులు సమీక్షించడానికి వీలులేదని దానం నాగేందర్ ప్రధాన వాదన. ఒకవేళ సభ లోపల సభ్యుడి (ఎమ్మెల్యే) వ్యవహార శైలి ఆధారంగానే స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అసెంబ్లీ వెలుపల సభ్యుడి ప్రవర్తన లేదా ఇతర పార్టీ తరఫున పోటీ చేశారనే ఫిర్యాదులు స్పీకర్ పరిధిలోకి రావన్నారు. ఈ విషయంలో స్పీకర్ తీసుకున్న నిర్ణయమే తుది నిర్ణయమని దానం నాగేందర్ స్పష్టం చేశారు. ఆర్టికల్ 226 కింద హైకోర్టు ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవడం సరికాదని తన పిటిషన్‌లో ప్రస్తావించారు.తాను బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేయలేదని, అలాగే కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం కూడా తీసుకోలేదని మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టం చేశారు. కేవలం మెడలో మూడరంగుల కండువా వేసుకున్నంత మాత్రాన కాంగ్రెస్‌లో చేరినట్లు భావించకూడదన్నారు. కాగా, ఈ పిటిషన్‌పై తమ వాదనలు విన్నాకే తగిన నిర్ణయం తీసుకోవాలని కోరుతూ బీజేపీ నేత మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిలు సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్లు దాఖలు చేశారు. తన పిటిషన్‌ను సాధ్యమైనంత త్వరగా మెన్షన్ చేసి అత్యవసర విచారణ కోరాలని దానం నాగేందర్ తరఫు న్యాయవాదులు కోరారు.హైకోర్టు తీర్పుపై తొలుత ఉపఎన్నికకే తాను సిద్ధమని, ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటానన్న దానం నాగేందర్, అంతలోనే సుప్రీంకోర్టును ఆశ్రయించడం హాట్ టాపిక్ అవుతోంది. ఇటీవల ఇళ్ల లబ్దిదారుల లక్కీ డ్రా ఎమ్మెల్యే లేకుండానే చేయడం, తమకు సరిగ్గా విలువ ఇవ్వడం లేదని.. అదే సమయంలో ఎంఐఎం ఎమ్మెల్యేలు అయితే అధికారులు ఉలిచ్చ పోసుకుంటున్నారని అసెంబ్లీలో వ్యాఖ్యానించడం తెలిసిందే. ఇటు బీఆర్ఎస్ ఎలాగూ సీటు ఇవ్వదు. అటు కాంగ్రెస్ లోనూ జూబ్లీహిల్స్‌లో అజారుద్దీన్‌కు ఎదురైన పరిస్థితే ఖైరతాబాద్‌లో తనకు ఎదురవుతుందని దానం భావించారని వినిపిస్తోంది. బై ఎలక్షన్ వచ్చినా కాంగ్రెస్ తనకే బీ ఫారమ్ ఇస్తుందని నమ్మకం లేకపోవడంతో సుప్రీంకోర్టుకు వెళ్లారన్న చర్చ ఊపందుకుంది.పలుమార్లు పార్టీలు మారిన దానం, గతంలో ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ బీఆర్ఎస్‌ను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించారు. అయితే, ఉపఎన్నికల్లో తనకు మద్దతు లభిస్తుందో లేదోనన్న ఆందోళనతో సుప్రీంకోర్టు మెట్లు ఎక్కారని ప్రచారం జరుగుతోంది.

# అన్నీ పార్టీలకు సవాలే...

**హైదరాబాద్, సెప్టెంబర్ 21, పెన్ పవర్:** దానం నాగేందర్‌పై అనర్హత వేటుతో ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి అనివార్యంగా మారే ఉపఎన్నిక ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు కొత్త ఊపిరి పోస్తుందా లేక మరిన్ని రాజకీయ సమస్యల్లోకి నెడుతుందా అన్నది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. పైకి చూస్తే అధికార కాంగ్రెస్‌పై పోరాడేందుకు ఇది ఒక సువర్ణావకాశంలా కనిపించినప్పటికీ, గ్రౌండ్ రియాలిటీ మాత్రం గులాబీ పార్టీకి పెను సవాలును విసురుతోంది. గతంలో పక్కనే ఉన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణం తర్వాత వచ్చిన ఉపఎన్నికలోనూ సెంటిమెంట్, సానుభూతి ఏమాత్రం పనిచేయలేదు. హైదరాబాద్ మహానగర పరిధిలో గ్రామీణ ప్రాంతాల తరహా సాంప్రదాయ రాజకీయాలు, సానుభూతి పవనాలు పనిచేయవన్న విషయం ఆ చేదు ఫలితంతో బీఆర్ఎస్‌కు స్పష్టంగా అర్థమైంది.ఖైరతాబాద్ క్షేత్రస్థాయి సమీకరణాలను నిశితంగా పరిశీలిస్తే ఇక్కడ సంస్థాగతంగా బీఆర్ఎస్ బలం దాదాపు శూన్యమనే చెప్పాలి. గత దశాబ్ద కాలంగా అక్కడ రాజకీయం మొత్తం దానం నాగేందర్ చుట్టూనే తిరిగింది తప్ప, పార్టీకంటూ ప్రత్యేక క్యాడర్ నిర్మాణం బలంగా జరగలేదు. దానంకు నియోజకవర్గంలో ఉన్న బలమైన వ్యక్తిగత అనుచరగణం, స్థానిక బస్తీల్లో ఆయనకున్న వ్యక్తిగత పట్టు కాదనలేని వాస్తవం. దీనికి తోడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఖైరతాబాద్‌లో సంప్రదాయబద్ధంగా ఉన్న పాత ఓటుబ్యాంకు, సంస్థాగత క్యాడర్ తోడవుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో బలమైన లోకల్ కేడర్, సరైన అభ్యర్థి లేని బీఆర్ఎస్‌కు దానం వ్యక్తిగత బలం, కాంగ్రెస్ ప్రభుత్వ యంత్రాంగాన్ని ఎదుర్కొని నిలబడటం కత్తిమీద సామే అవుతుంది.ఒకవేళ ఈ ఉపఎన్నిక జరిగి, అధికార కాంగ్రెస్ పార్టీ దానం నాగేందర్‌ను నిలబెట్టి మళ్లీ గెలిపించుకుంటే.. అది బీఆర్ఎస్ శ్రేణుల ఆత్మవిశ్వాసాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీస్తుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తనకున్న పట్టు చేజారిపోయిందని, పార్టీ మారిన నేతను కూడా ఓడించలేకపోయామనే బలహీనమైన సంకేతం రాష్ట్రవ్యాప్తంగా వెళ్తుంది. ఇది జీహెచ్ఎంసీ ఎన్నికలతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో గులాబీ పార్టీ క్యాడర్‌ను తీవ్ర నైరాశ్యంలోకి నెట్టే ప్రమాదం ఉంది. ప్రత్యర్థి చేతిలో దెబ్బతిని నైతికంగా కుంగిపోవడం కంటే, ఇలాంటి ప్రతికూల సమయంలో ఉపఎన్నికలను ఎదుర్కోవడం పార్టీకి రాజకీయంగా పెద్ద రిస్క్ అనే చెప్పాలి.అందుకే ఈ ఖైరతాబాద్ ఉపఎన్నిక అటు బీఆర్ఎస్‌కు మాత్రమే కాదు, ఇటు అధికార కాంగ్రెస్‌కు కూడా ఒక అన్‌వాంటెడ్ తలనొప్పి లాంటిదే. అధికారంలో ఉండి ఒక్క ఉపఎన్నికలో కూడా తేడా రాకూడదనే ఒత్తిడి కాంగ్రెస్‌పై ఉంటే.. పరువు కాపాడుకోవాల్సిన డూ ఆర్ డై సిట్యువేషన్ బీఆర్ఎస్‌ను వెంటాడుతోంది. గెలిస్తే వచ్చే మైలేజీ కంటే, పొరపాటున ఓడిపోతే ఎదురయ్యే నష్టమే బీఆర్ఎస్‌కు పదిరెట్లు ఎక్కువగా కనిపిస్తోంది. కాంగ్రెస్ పరిస్థితి కూడా అంతే. అయినా ఉపఎన్నికను రెండు పార్టీలు ఎదుర్కోక తప్పదు.

# అభ్యర్థి ఎంపికపై బీఆర్ఎస్ కసరత్తు.. టికెట్ దక్కేదెవరికి.?

**హైదరాబాద్, సెప్టెంబర్ 21, పెన్ పవర్:** దానం నాగేందర్‌పై హైకోర్టు అనర్హత వేటు వేయడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ సీటుకు ఉప ఎన్నిక జరగడం దాదాపు ఖాయమైంది. బీఆర్ఎస్‌లో అప్పుడే ఖైరతాబాద్ బైపోల్‌పై చర్చ మొదలైంది. నిన్నటి వరకు దానం నాగేందర్‌పై పోరాటం చేసిన బీఆర్ఎస్..ఇప్పుడు అదే సీటును తిరిగి స్వాధీనం చేసుకునేందుకు కసరత్తు స్టార్ట్ చేస్తోంది. అందుకే..అభ్యర్థి ఎంపికపై ఆచితూచి అడుగులు వేయాలని డిసైడ్ అయింది గులాబీ పార్టీ అధిష్టానం. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌లో ఖైరతాబాద్ టికెట్ ఆశిస్తున్న నేతలు.. ఎవరి ప్రయత్నాల్లో వాళు బిజీ అయిపోయారట.పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు ఖైరతాబాద్ నుంచి పోటీ చేసిన విష్ణుకు..నియోజకవర్గంతో ఉన్న పాత పరిచయాలు, పీజేఆర్ కుటుంబానికి ఉన్న రాజకీయ అనుబంధం తమకు కలిసొస్తుందని బీఆర్ఎస్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఖైరతాబాద్‌కు బైపోల్ వస్తే విష్ణువర్ధన్ రెడ్డిని బరిలో దింపే ఆలోచనలో బీఆర్ఎస్ ఉన్నట్లు కూడా ఎప్పటినుంచో ప్రచారం ఉంది.గతంలో ఇక్కడి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ పేరు కూడా టికెట్ రేసులో వినిపిస్తోంది. గతంలో ఖైరతాబాద్ నుంచి పోటీ చేసిన శ్రవణ్..ప్రస్తుతం బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా ఉన్నారు. నియోజకవర్గంతో ఉన్న అనుబంధంతో పాటు..బీసీ సామాజిక సమీకరణాలు కూడా తనకు అనుకూలంగా మారుతాయని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక మరో నేత తలసాని సాయికిరణ్ పేరు ఈ రేసులోకి రావడం మరింత ఆసక్తి రేపుతోంది. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తనయుడు సాయికిరణ్ యాదవ్ కూడా ఖైరతాబాద్ టికెట్ ఆశిస్తున్నట్లు టాక్.ఉపఎన్నిక రాబోతుందని ప్రచారం నడుస్తున్నప్పటి నుంచి సాయికిరణ్‌ను బరిలోకి దింపాలని తలసాని ప్రయత్నిస్తున్నారన్న ప్రచారం నడిచింది. సంక్రాంతి సందర్భంగా ఖైరతాబాద్ పరిధిలో జరిగిన కార్యక్రమాల విషయంలోనూ తలసాని, దానం వర్గాల మధ్య పోటాపోటీ కనిపించిందన్న చర్చ అప్పట్లో జరిగింది. దీంతో ఖైరతాబాద్ ఉపఎన్నికలో తనయుడు సాయికిరణ్‌ను పోటీ చేయించేందుకు తలసాని శ్రీనివాస్ యాదవ్ అప్పుడే ప్రయత్నాలు మొదలుపెట్టారన్న టాక్ వినిపిస్తోంది. తలసాని సాయికిరణ్ 2019 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కంటెస్ట్ చేసి ఓడిపోయారు.మరోవైపు పార్టీ కోసం చాలాకాలంగా పనిచేస్తున్న మన్నె గోవర్ధన్ రెడ్డి పేరు కూడా మరోసారి తెరపైకి వచ్చింది. 2014లో ఖైరతాబాద్ నుంచి పోటీ చేసిన మన్నె..2018, 2023లో దానం నాగేందర్‌కు అవకాశం ఇవ్వడంతో సీటు త్యాగం చేసి సహకరించారని ఆయన వర్గం చెబుతోంది. విష్ణువర్ధన్‌రెడ్డి..దాసోజు..సాయికిరణ్..మన్నె గోవర్ధన్‌రెడ్డి.. నలుగురి పేర్లు ఇప్పుడు ప్రచారంలో ఉన్నప్పటికీ..ఇక్కడే బీఆర్ఎస్ అసలు కసరత్తు మొదలుపెడుతుందట. ఎవరికి స్థానికంగా బలం ఉంది.? క్యాడర్‌ను నడిపించే సామర్థ్యం ఉన్న లీడర్లు ఎవరు.? సామాజిక సమీకరణాలు ఏంటి.? కాంగ్రెస్ అభ్యర్థిని ఢీకొట్టేందుకు ఎవరైతే సరైన అభ్యర్థి.? ఇలాంటి అంశాలన్నింటినీ పరిశీలించాకే అభ్యర్థిని ఫైనల్ చేయాలని గులాబీ అధిష్టానం భావిస్తోందన్న చర్చ జరుగుతోంది.గత బైపోల్స్ అనుభవాలను కూడా పరిగణనలోకి తీసుకుని..చివరి నిమిషం వరకు అభ్యర్థి ఎంపికపై సర్వేలు, ఫీడ్ బ్యాక్ తీసుకునే అవకాశం ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. గత రెండు బైపోల్స్‌లోనూ అభ్యర్థి విషయంలో చేసిన పొరపాటు ఈ సారి చేయకూడదనే పట్టుదలతో ఉంది గులాబీదళం. ఎమ్మెల్యేల మృతితో వచ్చిన ఎన్నికలు కావడంతో కంటోన్మెంట్, జూబ్లీహిల్స్‌లో అనివార్యంగా వారి కుటుంబసభ్యులకే టికెట్ ఇవ్వాల్సి వచ్చిందని..ఈ సారి గెలుపు గుర్రాన్నే ఎంపిక చేసుకునే అవకాశం ఉందని బీఆర్ఎస్ భావిస్తోంది.కేటీఆర్ ఇప్పటికే దానం నాగేందర్ అనర్హతపై స్పందిస్తూ.. ఖైరతాబాద్ ఉపఎన్నికలో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మారిన మిగతా ఎమ్మెల్యేలకూ ఇదే గతి పడుతుందన్నారు. దీంతో బీఆర్ఎస్‌కు ఖైరతాబాద్ బైపోల్ కేవలం మరో ఎన్నిక కాదనే చర్చ మొదలైంది. ఖైరతాబాద్‌లో గెలిచి అధికార పార్టీకి, జంపింగ్ ఎమ్మెల్యేలకు ఝలక్ ఇవ్వాలని కసి మీదుందట బీఆర్ఎస్. అందుకే క్యాండిడేట్ సెలక్షన్ విషయంలో ఒక్క చిన్న తప్పిదం కూడా చేయకూడదని గులాబీ పార్టీ భావిస్తున్నట్లు టాక్. ఖైరతాబాద్ బరిలో దిగే గులాబీ అభ్యర్థి ఎవరన్నది నోటిఫికేషన్ వస్తే తప్ప క్లారిటీ వచ్చేలా లేదు.

# వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టుకు ఫుల్ క్రేజీ

**వరంగల్, సెప్టెంబర్ 21, పెన్ పవర్:** తెలంగాణ కాంగ్రెస్‌లో ఏ పోస్టుకు లేనంత క్రేజ్ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులకు ఉంటుంది. వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి.. ఒక లక్కీ పోస్ట్‌గా భావిస్తుంటారు నేతలు. ఎందుకంటే పీపీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు పనిచేసిన లీడర్లు ఉన్నత స్థానాలకు ఎదుగుతారనే సెంటిమెంట్ ఉంది. ప్రస్తుతం మంచి పొజిషన్‌లో ఉన్న నేతలంతా కూడా తెలంగాణ ఏర్పడిన తర్వాత వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేసినవారే. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు అజారుద్దీన్, పొన్నం ప్రభాకర్ ఇలా అందరూ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా పనిచేశారు.తెలంగాణ ఏర్పడిన తర్వాత మొదట వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేసిన ఉత్తమ్ కుమార్ రెడ్డి తర్వాత పీసీసీ చీఫ్‌గా రికార్డ్ స్థాయిలో ఏడేళ్లు పని చేశారు. తర్వాత వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేసిన భట్టి విక్రమార్క సీఎల్పీ లీడర్ అయ్యారు. ఇప్పుడు డిప్యూటీ సీఎంగా ఉన్నారు. ఇక రేవంత్ రెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి చేపట్టి తర్వాత.. పీసీసీ చీఫ్.. ఆ తర్వాత సీఎం అయ్యారు. మహేష్ కుమార్ గౌడ్ కూడా వర్కింగ్ ప్రెసిడెంట్ తర్వాత పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. త్వరలో ఆయనకు కూడా ప్రమోషన్ దక్కబోతుందని ప్రచారం నడుస్తోంది. ఇలా వర్కింగ్ ప్రెసిడెంట్లుగా పనిచేసిన వారికి తర్వాత లక్కీ ఛాన్స్ ఉంటుందనే బలమైన నమ్మకం ఉండటంతో..ఆశావహుల జాబితా పెరిగిపోతోంది.ప్రపంచ పటాలు పరిశీలించండిముఖ్య నేతలు కూడా తమ వారికి వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ ఇప్పించుకునేందుకు లాబీయింగ్ చేస్తున్నారట. అయితే, ఈ పోస్టుల నియామకం కోసం పెద్ద కసరత్తే జరుగుతోందట. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులకు పోటీ పడుతున్న పలువురు పేర్లపై అభ్యంతరాలు వ్యక్తం చేశారట. దీంతో దాదాపు రెండేళు గా ఈ పదవుల నియామకం పెండింగ్‌లో పడుతూ వచ్చింది. అనేక రకాల చర్చల తర్వాత.. వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకానికి పార్టీ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందనే టాక్ బలంగా వినిపిస్తుంది.ప్రస్తుతం ఇంచార్జ్‌గా ఉన్న మీనాక్షి నటరాజన్ లండన్ వెళ్తున్నారు. ఇప్పటికే వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులపై ఆమె హైకమాండ్‌కు రిపోర్ట్ ఇచ్చేశారట. అన్ని సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలని అధిష్టానం భావిస్తోందట. రెడ్డి సామాజిక వర్గం నుంచి సీఎం రేవంత్ తన స్నేహితుడు రోహిణ్ రెడ్డి కోసం పట్టు బట్టడంతో.. ఇంచార్జ్ మీనాక్షి కూడా ఓకే చెప్పారట. మైనారిటీ వర్గం నుంచి సీఎం రేవంత్.. తన సన్నిహితుడు ఫహీం ఖురేషి పేరు ప్రతిపాదిస్తే ఇంచార్జ్ మీనాక్షి బ్రేక్ వేశారట. ఈ విషయంలో సీఎం కూడా వెనక్కి తగ్గారట. మైనారిటీ వర్గం నుంచి ఓబేదుల్లా కొత్వాల్ పేరు ఖరారైందట. ఎస్టీ వర్గం నుంచి ఎంపీ బలరాం నాయక్.. ఎస్సీ వర్గం నుంచి సంపత్ కుమార్ పేర్లను ఫిక్స్ చేశారని అంటున్నారు.వర్కింగ్ ప్రెసిడెంట్లతో పాటు పెండింగ్‌లో ఉన్న ప్రచార కమిటీ, మిగిలిన జనరల్ సెక్రటరీలు, వైస్ ప్రెసిడెంట్ పోస్టులను కూడా భర్తీ చేయబోతున్నారట. నామినేటెడ్ పోస్టులకు కూడా హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని చర్చించుకుంటున్నారు. ఈ నియామకాలన్నింటినీ వారం రోజుల్లోగా పూర్తి చేయాలని భావిస్తున్నారట పార్టీ పెద్దలు. ఈ సారైనా వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులకు గ్రహణం వీడుతుందో.? మళ్లీ ఏదైనా బ్రేకులు పడుతాయో.? చూడాలి మరి.

# లోకల్ పోల్స్ కు కాంగ్రెస్ రెడీ...



**విజయవాడ, సెప్టెంబర్ 21, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న కాంగ్రెస్ పార్టీ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను వేదికగా చేసుకుని పూర్వవైభవం సాధించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సారథ్యంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి పునర్నిర్మించే క్రమంలో 10 మంది సీనియర్ నేతలతో కూడిన రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ ని ఏర్పాటు చేయడం ఆసక్తికరంగా మారింది. ఈ కమిటీకి సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ పీసీసీ చీఫ్ ఎన్. రఘువీరారెడ్డిని ఛైర్మన్‌గా, మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలంను కన్వీనర్‌గా నియమించడం ద్వారా కాంగ్రెస్ తన పాత కాపులను, అనుభవజ్ఞులను మళ్లీ ప్రధాన స్రవంతిలోకి తెచ్చేందుకు తగిన వేదికను సిద్ధం చేసింది. ఈ తాజా నియామకాల్లో ప్రధానంగా ఆకట్టుకుంటున్న అంశం రఘువీరారెడ్డి రీ-ఎంట్రీ. రాష్ట్ర విభజన అనంతరం అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో పీసీసీ అధ్యక్షుడిగా పార్టీని నడిపిన ఆయన, గత కొంతకాలంగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ ఆధ్యాత్మిక, వ్యవసాయ కార్యక్రమాలకే పరిమితమయ్యారు. అయితే, రాయలసీమతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివాదరహిత నాయకుడిగా, సౌమ్యుడిగా ఆయనకున్న మంచి పేరును వాడుకోవాలని ఏఐసీసీ భావించింది. బిసి, యాదవ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నేతగా, ఉమ్మడి ఏపీలో కీలక మంత్రిత్వ శాఖలు నిర్వహించిన రఘువీరారెడ్డి నాయకత్వం.. సైలెంట్‌గా ఉన్న పాత కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపే అవకాశం ఉంది. ఈ 10 మంది సభ్యుల కమిటీ ప్రాథమిక విధి కేవలం టికెట్ల కేటాయింపు లేదా కార్యాలయ వ్యవహారాలకే పరిమితం కాదు. సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రులు పల్లంరాజు, కిల్లి కృపారాణి, తులసిరెడ్డి, షేక్ మస్తాన్ వలి వంటి దిగ్గజాలతో కూడిన ఈ బృందం త్వరలోనే జిల్లాల పర్యటనలకు శ్రీకారం చుట్టనుంది. గత కొన్నేళ్లుగా వైసీపీ, టీడీపీల వైపు వెళ్లిన ద్వితీయ శ్రేణి నేతలను, కాంగ్రెస్‌తో అనుబంధం ఉన్న పాత కుటుంబాలను పరామర్శించడం, తీవ్ర అసంతృప్తితో ఉన్న క్షేత్రస్థాయి శ్రేణులను తిరిగి సొంత గూటికి రప్పించడమే ఈ కమిటీ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. రాజకీయ సమీకరణాల పరంగా చూస్తే, ప్రస్తుతం ఏపీలో తీవ్రమైన అధికార-ప్రతిపక్ష పోరు నెలకొంది. ఓవైపు వైఎస్ఆర్‌సీపీ తమ అభ్యర్థులను నిలబెట్టేందుకు కష్టపడుతున్న తరుణంలో, మరోవైపు కూటమి ప్రభుత్వంపై ఉండే సహజ వ్యతిరేకతను లేదా తటస్థ ఓటు బ్యాంకును ఆకర్షించడానికి కాంగ్రెస్‌కు ఇది అనుకూల సమయం. స్థానిక సంస్థల పోరులో పంచాయతీ, మండల, మున్సిపల్ స్థాయిలో బహుముఖ పోటీని సృష్టించడం ద్వారా, రాష్ట్రంలో కనీసం 10 నుండి 15 శాతం ఓటు బ్యాంకును తిరిగి సాధించవచ్చని పార్టీ అంచనా వేస్తోంది. వైఎస్సార్ వారసత్వం కార్డ్‌ను షర్మిల వాడుతుండగా, పాత కాంగ్రెస్ పునాదుల ను రఘువీరా బృందం బలోపేతం చేసే ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్ బాటలో సవాళ్లు తక్కువగానేమీ లేవు. క్షేత్రస్థాయిలో పార్టీకి ఆర్థికంగా, అంగబలంతో అండగా నిలిచే నాయకత్వం దాదాపు కనుమరుగైంది. ఎన్నికల నిర్వహణ వ్యయం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో, గెలుపు గుర్రాలను వెతికి పట్టుకోవడం ఈ కమిటీకి అతిపెద్ద అగ్నిపరీక్ష. అలాగే రఘువీరారెడ్డి సుదీర్ఘ విరామం తర్వాత క్షేత్రస్థాయిలో ఎంతవరకు పర్యటించి, నేతలలో ఆత్మవిశ్వాసాన్ని నింపగలరనేది కూడా కీలకం. ఏది ఏమైనా, సరైన వ్యూహం లేకుండా ఎన్నికలకు వెళ్లే విధానానికి స్వస్తి పలికి, ముందుగానే పక్కా కసరత్తు ప్రారంభించడం కాంగ్రెస్ సాధించిన సానుకూల పరిణామంగానే చెప్పాలి. రఘువీరారెడ్డి నేతృత్వంలోని ఈ హైపవర్ కమిటీ ఏపీ కాంగ్రెస్‌కు ఎంతవరకు సంజీవని గా మారుతుందో వేచి చూడాలి. అధికారంలో ఉన్న కూటమిని, ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్ఆర్‌సీపీని తట్టుకుని స్థానిక పోరులో స్థానాలు గెలుచుకుంటేనే 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి ఏపీలో కాంగ్రెస్ పునరుజ్జీవనానికి పునాది పడుతుంది.

# జనసేన తీర్థానికి వైఎస్ఆర్‌సీపీ సీనియర్ల దూరమా?



**ఒంగోలు సెప్టెంబర్ 21, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ఆర్‌సీపీ ప్రాధాన్యం క్రమంగా తగ్గుతున్న క్రమంలో, ఆ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు గుడ్‌బై చెబుతూ కొత్త దారులు వెతుక్కుంటున్నారు. విజయనగరం జిల్లా జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వైఎస్ఆర్‌సీపీకి రాజీనామా చేసిన వెంటనే నేరుగా టీడీపీ గూటికి చేరడం చర్చనీయాంశం అయింది. ప్రతిపక్షం నుంచి బయటకు వస్తున్న నేతలకు కూటమి రూపంలో రెండు వేదికలు అందుబాటులో ఉన్నప్పటికీ, మెజారిటీ నాయకులు జనసేన వైపు చూడకుండా కేవలం తెలుగుదేశం వైపే మొగ్గు చూపడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఈ పరిస్థితికి ప్రధాన కారణం జనసేనలో చేరిన తర్వాత లభిస్తుందనుకున్న ప్రాధాన్యత పై రాజకీయ నేతలకు ఉన్న అనుమానాలే. వైఎస్ఆర్‌సీపీ నుంచి బయటకు వచ్చి జనసేన తీర్థం పుచ్చుకున్న మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఉదంతం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. రాయలసీమ , ప్రకాశం జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న బాలినేని వంటి సీనియర్ నేత జనసేనలో చేరినప్పటికీ, ఆయనకు క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో ప్రాధాన్యత లభించడం లేదనే అభిప్రాయం ఉంది. పైగా ఒంగోలు పరిసర నియోజకవర్గాల్లో కూటమి భాగస్వామి అయిన టీడీపీ స్థానిక నేతలతో బాలినేనికి తరచూ విభేదాలు రావడం, కూటమి శ్రేణుల మధ్య ఘర్షణలు వాతావరణం నెలకొనడం వంటివి ఆయనకు మరింత ఇరకాటంగా మారాయి. జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పార్టీ విషయంలో అనుసరిస్తున్న కఠినమైన ఫిల్టరింగ్ విధానం కూడా ఈ వలసల వేగాన్ని తగ్గించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలోకి వచ్చే వారి విషయంలో పవన్ జాగ్రత్తలు వహిస్తున్నారు. గతంలో జనసేనను, పవన్ కళ్యాణ్‌ను వ్యక్తిగతంగా తీవ్రస్థాయిలో విమర్శించిన వైఎస్ఆర్‌సీపీ నేతలను, ,నియోజకవర్గాల్లో వివాదాస్పద ఇమేజ్ ఉన్న వారిని పార్టీలోకి చేర్చుకోవడానికి ఆయన సుముఖంగా లేరు. దీంతో పార్టీలోకి రావాలని ఆశపడే నేతలకు కనీసం గ్రీన్ సిగ్నల్ కూడా లభించని పరిస్థితి నెలకొంది. అధికారిక ప్రాధాన్యత , నియోజకవర్గాల్లో పట్టు సాధించే క్రమంలో టీడీపీయే సరైన వేదిక అని జంపింగ్ నేతలు భావిస్తున్నారు. పాత వైఎస్ఆర్‌సీపీ నేతలకు నియోజకవర్గ స్థాయి వ్యవస్థలపై, అధికారులపై ప్రభావం చూపగలిగే బలమైన కేడర్ అవసరం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీకి గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు బలమైన యంత్రాంగం ఉంది. జనసేన ఓటు బ్యాంకు బలమైనదే అయినప్పటికీ, నియోజకవర్గంలో రాజకీయం నడపాలంటే టీడీపీ అధికారిక ఛత్రం కింద ఉండటమే రక్షణ అని సీనియర్ నాయకులు లెక్కింపులు వేస్తున్నారు. జనసేన అంతర్గత నిర్మాణం, నిర్ణయాల ప్రక్రియ కూడా ఇక్కడ ఒక అంశంగా మారింది. పవన్ కళ్యాణ్ చుట్టూ ఉన్న కోటరీ , పరిమితమైన పార్టీ పదవుల కేటాయింపు వల్ల, కొత్తగా చేరే వైఎస్ఆర్‌సీపీ మాజీ సీనియర్లకు సముచిత స్థానం దక్కుతుందా లేదా అనే సంశయం ఉండిపోయింది. బాలినేని శ్రీనివాసరెడ్డి ఉదంతాన్ని చూసిన తర్వాత చాలామంది వైఎస్ఆర్‌సీపీ సీనియర్లు జనసేనలోకి వెళ్లి మూలన పడేకంటే, నేరుగా టీడీపీలోకి వెళ్లి తమ ఉనికిని చాటుకోవడమే మేలు అనే ముగింపునకు వచ్చినట్లు కనిపిస్తోంది. ఈ పరిణామాలు క్షేత్రస్థాయిలో జనసేన విస్తరణకు కొంత అడ్డంకిగా మారినప్పటికీ, స్వచ్ఛమైన ఇమేజ్ ఉన్నవారినే పార్టీలోకి తీసుకోకూడదనే పవన్ కళ్యాణ్ వ్యూహం సుదీర్ఘకాలంలో పార్టీ సిద్ధాంతానికి మేలు చేస్తుందని జనసేన వర్గాలు వాదిస్తున్నాయి. అయితే, ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ బలహీనపడుతున్న ఈ కీలక సమయంలో వలసొచ్చే బలమైన నేతలను ఆకర్షించడంలో జనసేన వెనుకబడితే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని నిర్మించుకోవడం ఆ పార్టీకి అతిపెద్ద సవాలుగా మారే అవకాశముంది.

# కల్తీ నెయ్యి... అడ్డంగా దొరికినట్టేనా

**తిరుమల, సెప్టెంబర్ 21, పెన్ పవర్:** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ నెయ్యి వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వెల్లడించిన దర్యాప్తు వివరాలను పట్టుకుని వైఎస్సార్‌సీపీ చేస్తున్న ప్రచారం ఆ పార్టీకే రాజకీయంగా, నైతికంగా తీవ్రమైన సెల్ఫ్ గోల్‌గా మారుతోంది. సుకృతి ఫుడ్స్ ప్రమోటర్ కైలాష్ చంద్ మంగ్లాను అరెస్ట్ చేసిన ఈడీ.. టీటీడీకి సరఫరా చేసిన నెయ్యిలో పామాయిల్, పామ్ కెర్నల్ ఆయిల్, ఎంజీ-90, మైవాసెట్ సాఫ్ట్ 400 వంటి ప్రమాదకర రసాయనాలు కలిపారని స్పష్టం చేసింది. అయితే, ఇందులో జంతు కొవ్వు ప్రస్తావన లేదన్న ఒకే ఒక్క పాయింట్‌ను పట్టుకుని, చూశారా మేం జంతు కొవ్వు వాడలేదు, మాపై తప్పుడు ఆరోపణలు చేశారు అంటూ వైసీపీ నేతలు సంబరాలు చేసుకోవడం, ఊరట పొందుతున్నట్లు ప్రకటనలు విడుదల చేయడం తీవ్ర విస్మయానికి గురిచేస్తోంది. ఈ రకమైన సమర్థన ద్వారా ఐదేళ్ల తమ హయాంలో తిరుమలకు నకిలీ, విష రసాయనాల నెయ్యి సరఫరా జరిగిందన్న దారుణ సత్యాన్ని వైఎస్సార్‌సీపీ పరోక్షంగా నూటికి నూరు శాతం అధికారికంగా అంగీకరించినట్లయింది. ప్రాథమికంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అనేది ఒక ఆర్థిక నేరాల దర్యాప్తు సంస్థ మాత్రమే. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ పరిధిలో అక్రమ నగదు లావాదేవీలు, డొల్ల కంపెనీలు, కల్తీ సరుకు కొనుగోళ్ల ముసుగులో జరిగిన నిధుల మళ్లింపును నిగ్గుతేల్చడమే దాని పని. నెయ్యిలో జంతు కొవ్వు ఉందా, లేదా అనేది తేల్చాల్సింది ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ , ప్రత్యేక ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లు, కోర్టు పరిధిలోని సిట్ దర్యాప్తు మాత్రమే తప్ప, అది ఈడీ పరిధిలోని అంశం కాదు. అలాంటప్పుడు ఈడీ రిపోర్టులో జంతు కొవ్వు పేరు రాలేదని సంబరాలు చేసుకోవడం ప్రజల దృష్టిని మళ్లించే కుట్రే. ఈడీ మోపిన 230 కోట్ల అక్రమ దందా, ఫేక్ రికార్డులు, విషపూరిత కెమికల్స్‌తో కూడిన తయారీ ఆరోపణలను వైసీపీ పూర్తిగా ఒప్పేసుకున్నట్లే అవుతోంది. భారతీయ సంస్కృతిలో, హిందూ ధర్మంలో తిరుమల వేంకటేశ్వర స్వామికి సమర్పించే నైవేద్యం పవిత్రమైనది. దేశవిదేశాల నుంచి కోట్ల మంది భక్తులు పరమ భక్తితో స్వీకరించే లడ్డూ ప్రసాదంలో ఆవు నెయ్యి స్థానంలో రీఫైన్డ్ పామాయిల్, మోనోగ్లిజరైడ్స్ వంటి పారిశ్రామిక రసాయనాలను కలిపి అంటగట్టడం కలియుగ దైవానికి చేసిన క్షమించరాని మహాపచారం కాదా? మేము విష రసాయనాలు మాత్రమే వాడాము తప్ప జంతు కొవ్వు వాడలేదని వాదించడం ఎంతటి దిగజారుడుతనం? కల్తీ జరిగిందని నిర్ధారణ అయినప్పుడు, అది ఏ రూపంలో ఉన్నా భక్తుల మనోభావాలను, దైవ పవిత్రతను తీవ్రంగా దెబ్బతీసిన ఘోర నేరమే అవుతుంది. మనీలాండరింగ్ కోణంలో 230 కోట్ల కుంభకోణం జరిగిందని, అందులో 96 కోట్ల విలువైన కల్తీ రసాయన నెయ్యి ఒక్క కంపెనీ నుంచే సరఫరా అయిందని ఈడీ తేల్చింది. పాల సేకరణే లేని ఫ్యాక్టరీల నుంచి ట్యాంకర్ల కొద్దీ కెమికల్ లిక్విడ్ తిరుమల కొండపైకి చేరుతుంటే అప్పటి పాలకమండలి పెద్దలు ఏం చేస్తున్నారు? ఈ అక్రమ రవాణాలో టీటీడీ అధికారులకు, రాజకీయ పెద్దలకు అందిన ముడుపుల మాటేమిటి? శ్రీవారి భక్తుల మనోభావాలతో చెలగాటమాడి, ఆరోగ్యాన్ని పణంగా పెట్టి వేల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టిన ఈ ముఠాకు చట్టపరంగా పడే సాధారణ శిక్షలు సరిపోవు.

రూ.230 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కోసం ఏకంగా రూ.230 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రకటించిచిది. ఇది కేవలం వ్యాపారుల స్వార్థం మాత్రమే ఉందంటే సామాన్యులు కూడా నమ్మే పరిస్థితి లేదు. సుకృతి ఫుడ్స్ ప్రమోటర్ కైలాష్ చంద్ మంగ్లా, భోలే బాబా డెయిరీ విపిన్ జైన్ వంటి వ్యాపారులు నెయ్యి స్థానంలో పామాయిల్, కెమికల్స్ కలిపారన్నది సాంకేతిక ఆధారాలతో తేలింది. కానీ, నిత్యం కఠిన నిబంధనలు, ల్యాబ్ టెస్టులు, సెక్యూరిటీ ఉండే తిరుమల వంటి పరమ పవిత్ర పుణ్యక్షేత్రంలోకి ఏళ్ల తరబడి ఎలాంటి అడ్డంకులు లేకుండా ట్యాంకర్ల కొద్దీ విషపూరిత నెయ్యి ప్రవేశించిందంటే.. కచ్చితంగా త్యున్నత రాజకీయ అండదండలు లేకుండా ఇది సాధ్యమయ్యే పనేనా ?ఈ ప్రశ్నకు మరింత బలాన్ని చేకూరుస్తోంది టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వ్యక్తిగత సహాయకుడు కదూరు చిన్న అప్పన్న వ్యవహారం. నెయ్యి సరఫరా చేసే డెయిరీ కాంట్రాక్టర్ల వద్ద కిలో నెయ్యికి 25 చొప్పున కమీషన్ డిమాండ్ చేశారన్న అభియోగాలతో ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం అప్పన్నను ఏ-24గా అరెస్ట్ చేసి జైలుకు పంపింది. లంచం ఇవ్వడానికి నిరాకరించిన డెయిరీలను నిబంధనల పేరుతో బెదిరించి బ్లాక్‌లిస్ట్‌లో పెట్టించడం, కమీషన్లు ముట్టజెప్పిన కంపెనీలకు రేట్లు పెంచి కాంట్రాక్టులు కట్టబెట్టడం, హవాలా ద్వారా కోట్లాది రూపాయల ముడుపులు అందుకోవడం వంటి అంశాలపై సిట్ ఆధారాలు సేకరించింది. పూరి గుడిసె నేపథ్యం ఉన్న ఒక సాధారణ పీఏ ఖాతాల్లోకి, బినామీ ఆస్తుల్లోకి కోట్ల రూపాయల నిధులు ఎలా చేరాయన్నది ఈ వ్యవహారంలో అసలు గుట్టును బయటపెడుతోంది.

**చైర్మన్ పీఏ ... చైర్మన్ చెప్పకుండా చేయగలడా?**

అయితే ఇక్కడే అసలైన రాజకీయ, పరిపాలనాపరమైన ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒక చైర్మన్ పీఏ స్థాయి వ్యక్తి ఇంతటి మెగా కుంభకోణాన్ని సొంత పూచీకత్తుతో నడిపించగలడా? డెయిరీలను బెదిరించడం, టీటీడీ కొనుగోలు విభాగం అధికారులను ఆదేశించడం, టెండర్లలో నిబంధనలు మార్చేలా ఒత్తిడి తేవడం ఆయన ఒక్కడి వల్లే అయ్యే పనేనా? వైవీ సుబ్బారెడ్డి పేరును, ఆయన అధికారాన్ని వాడుకోకుండా బోర్డు పరిధిలోని వ్యవహారాలను ఒక పీఏ శాసించడం అసాధ్యమనేది బహిరంగ రహస్యం. గతంలో కల్తీ గురించి ఫిర్యాదులు, ల్యాబ్ నివేదికలు వచ్చినా బుట్టదాఖలు కావడం వెనుక తిరుమల పాలకమండలి పెద్దల మౌనమే రక్షణ కవచంగా నిలిచిందన్న విమర్శలు బలంగా ఉన్నాయి. ప్రస్తుతం సిట్ అప్పన్నను అదుపులోకి తీసుకుని విచారించగా, ఈడీ మాత్రం కైలాష్ మంగ్లా, విపిన్ జైన్ వంటి తయారీదారులను అరెస్ట్ చేస్తూ పీఎంఎల్‌ఏ చట్టం కింద మనీ ట్రయల్ ను ఛేదిస్తోంది. కల్తీ నెయ్యి వ్యాపారులు సృష్టించిన నల్లధనం ఎవరెవరి ఖాతాల్లోకి వెళ్లింది, ఎవరికి కమీషన్లుగా ముట్టింది అనే బ్యాంకింగ్, హవాలా లింకులు బయటకు వస్తే.. ఆ దర్యాప్తు ముగింపు అప్పన్న వద్దే ఆగిపోవడం అసాధ్యం. అప్పన్న ద్వారా ఆ ముడుపులు ఎవరి గడప దాటాయి, టీటీడీ అప్పటి ఉన్నతాధికారులు, బోర్డు చైర్మన్ కార్యాలయానికి దీనితో ఉన్న లంకె ఏమిటన్నది తేలక తప్పదు.

# 100 శాతం స్ట్రైక్ రేటుపై గురి

**కాకినాడ, సెప్టెంబర్ 21, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగబోయే మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి జనసేన పార్టీ అత్యంత పకడ్బందీ వ్యూహాన్ని రచిస్తోంది. పొత్తుల రాజకీయంలో సీట్ల సంఖ్య కోసం వెంపర్లాడే సాంప్రదాయ ధోరణికి భిన్నంగా.. పోటీ చేసిన ప్రతిచోటా గెలిచి తీరాలనే దృఢ నిశ్చయంతో అడుగులు వేస్తోంది. విశాఖపట్నంలో జరిగిన పార్టీ ఆత్మీయ సమావేశంలో పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ చేసిన వ్యాఖ్యలు జనసేన క్షేత్రస్థాయి వ్యూహాన్ని స్పష్టం చేశాయి. మనం తీసుకునే ప్రతిదీ గెలిచే సీటే తీసుకుందాం. కేడర్ నుంచి ఒత్తిడి ఉంది కదా అని గుడ్డిగా 60, 70 లేదా 120 సీట్లు తీసుకోము అని తేల్చిచెప్పడం ద్వారా.. సీట్ల సంఖ్య కంటే గెలుపు గుర్రాలపైనే పార్టీ పూర్తి దృష్టి పెట్టిందన్న స్పష్టమైన సంకేతాన్ని శ్రేణులకు ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో 21 అసెంబ్లీ, 2 ఎంపీ స్థానాల్లో పోటీ చేసి 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించిన రికార్డును స్థానిక సమరంలోనూ పునరావృతం చేయడమే పార్టీ ప్రధాన అజెండాగా కనిపిస్తోంది. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తీవ్ర నిర్బంధాలు, బెదిరింపులను ఎదుర్కొంటూనే విశాఖ కార్పొరేషన్‌లో 3 వార్డులు గెలవడంతో పాటు 7 చోట్ల రెండో స్థానంలో నిలిచిన చరిత్రను పార్టీ గుర్తుచేసుకుంటోంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాలనాపరమైన పనితీరు ప్రజల్లో సానుకూలతను పెంచిన వేళ.. క్షేత్రస్థాయిలో పార్టీకి తిరుగులేని పట్టున్న వార్డులు, డివిజన్లను గుర్తించి అక్కడ మాత్రమే పూర్తి బలంతో బరిలోకి దిగాలని అధినాయకత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. కూటమిలో భాగస్వామిగా ఉంటూ అనవసర డిమాండ్లతో సమన్వయాన్ని దెబ్బతీయకుండా, వాస్తవ బలాబలాల ఆధారంగానే సీట్ల సర్దుబాటు ఉండాలనేది జనసేన లైన్. ఏదో ప్రభావం చూపే స్థానంలో ఉన్నాం కదా అని మిత్రపక్షాలపై ఒత్తిడి తెచ్చి ఎక్కువ సీట్లు తీసుకోవడం.. ఆ తర్వాత సమన్వయం లేక లేదా అభ్యర్థుల బలహీనత వల్ల చేజేతులా ఓడిపోవడం వంటి తప్పులకు జనసేన తావివ్వదలుచుకోలేదు. స్థానిక సమస్యలపై పట్టు, ప్రజల్లో నిరంతరం ఉండే నాయకత్వం, గెలిచే సత్తా ఉన్న అభ్యర్థులు ఉన్న చోట మాత్రమే కూటమి తరపున జనసేన సీట్లను క్లెయిమ్ చేయాలని నిర్ణయించింది. ఇది అటు కూటమి ఐక్యతను కాపాడటంతో పాటు, ప్రత్యర్థి వైఎస్సార్‌సీపీకి ఏ ఒక్క స్థానంలోనూ పట్టు చిక్కకుండా చేసే వ్యూహాత్మక ఎత్తుగడ. పార్టీ శ్రేణులకు నాయకత్వం ముందస్తు హెచ్చరికలు కూడా జారీ చేసింది. టికెట్ రాగానే గెలిచేసినట్లు భావించే అతివిశ్వాసం వద్దని, సోషల్ మీడియాలో వచ్చే అనవసర ప్రచారాలు, సీట్ల సంఖ్యపై సాగే చర్చలను పట్టించుకోవద్దని తేల్చిచెప్పింది. అధినేత పవన్ కళ్యాణ్ నిర్ణయమే తుది నిర్ణయమని, పార్టీ ఎక్కడ పోటీ చేసినా అక్కడ జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని కేడర్‌కు స్పష్టం చేశారు. సంఖ్యతో కూడిన డాంబికాల కంటే.. పోటీ చేసిన ప్రతి స్థానంలోనూ విజయకేతనం ఎగురవేసి అన్‌బీటెన్ బ్రాండ్‌ను కాపాడుకోవడమే జనసేన అసలైన స్థానిక మంత్రంగా కనిపిస్తోంది.

# పవన్ ఏం చెబుతారో... సర్వత్రా ఉత్కంఠ !



**హైదరాబాద్ పెన్ పవర్:** జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ నెల 22న కాకినాడ వేదికగా కీలకమైన పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశం స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జరుగుతోంది. దాంతో స్థానిక ఎన్నికల విషయంలో జనసేన వ్యూహాలు ఏమిటి ఆ పార్టీ పోటీ చేసే సీట్లు ఎన్నికల పొత్తులలో వ్యవహరించే విధానం మీద అంతటా ఆసక్తి అయితే ఉంది. ఎందుకంటే 2024 ఫార్ములాను జనసేన నేతలు ఇప్పటికే కాదు కూడదని చెప్పారని అంటున్నారు. అంతే కాదు 30 శాతం సీట్లు తమకు దక్కాలని కోరుకుంటున్నారు అని కూడా ప్రచారంలో ఉంది. అయితే అదే సమయంలో జనసేన అగ్ర నేత మంత్రి నాదెండ్ల మనోహర్ విశాఖలో జరిగిన పార్టీ సమావేశంలో మాట్లాడుతూ బలం ఉన్న చోటనే జనసేన పోటీ పడాలని సూచించినట్లుగా వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఈ కీలక సమావేశం మీద అందరి ఫోకస్ ఉందిపుడు.

**తీవ్ర అసంతృప్తితో :**

ఇదిలా ఉంటే నాదెండ్ల మనోహర్ బలం ఉన్న చోట పోటీ పడాలని బాధ్యత కలిగిన పార్టీగా జనసేన వ్యవహరించాలని సూచించినట్లుగా ప్రచారం సాగింది. దీని మీద జనసైనికులు అయితే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు అని అంటున్నారు. ఎందుకంటే ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని చాలామంది పెద్ద ఎత్తున ఉత్సాహం చూపిస్తున్నారు. ఈ తరహా ప్రకటనలు వారి ఆశల మీద నీళ్ళు చల్లుతున్నాయి. దాంతో ఈ పరిణామాల నేపథ్యంలో జనసేన అధినేత పవన్ వెంటనే ఒక అతి ముఖ్య సమావేశం ఏర్పాటు చేయడంతో పవన్ ఏమి చెబుతారు అన్నది అయితే చర్చకు వస్తోంది.

**పవన్ డెసిషన్ అంటే :**

ఇక చూస్తే పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ అధినేత హోదాలో ఏది చెప్పినా అదే ఫైనల్ అని అంటున్నారు. ఈసారి ఎక్కువ సీట్లు తీసుకుని కూటమితో కలసి పోటీ చేస్తామని పవన్ కనుక ప్రకటిస్తే ఆ లెక్క వేరే ఉంటుందని అంటున్నారు. ఎందుకంటే దశాబ్దం పైగా జనసేన నాయకులు కానీ క్యాడర్ కానీ పార్టీ కోసం ఎంతగానో శ్రమించారు అని ఇప్పుడు వారికి గ్రౌండ్ లెవెల్ లో అధికారం అందుకునే చాన్స్ వచ్చిందని అంటున్నారు. అదే విధంగా పార్టీలో క్షేత్ర స్థాయిలో ఆశలు ఆకాంక్షలకు పవన్ నిర్ణయాలు ప్రతిబింబిస్తాయని కూడా అనేక మంది భావిస్తున్నారు. అయితే జనసేన కూటమిలో అతి ముఖ్య భాగస్వామి. కాబట్టి ఆచీ తూచీ నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఉంటాయని అంటున్నారు. దాంతో బాలెన్స్ గానే జనసేన విధానాలు కానీ ఆలోచనలు కానీ ఉంటాయని చెబుతున్నారు. అలా కనుక చూస్తే ఏ రకమైన తీర్మానం వెలువడుతుంది అన్నది కూడా ఉత్కంఠను రేపేదిగా ఉంటుందని అంటున్నారు.

**కందులకు బాధ్యతలు :**

మరో వైపు చూస్తే జనసేన పార్టీకి సంబంధించి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రచార సారథ్యాన్ని కో ఆర్డినేట్ చేసుకునే కీలక భూమికను మంత్రి కందుల దుర్గేష్ కి పవన్ అప్పగించారు. దీంతో ఆయన మీద మరింత కొత్త భారాలు పెరిగాయని అంటున్నారు. సౌమ్యుడిగా ఉంటూ అందరికీ కలుపుకుని పోయే కందులకు జనసేన ప్రచార కమిటీ కో ఆర్డినేటర్ గాబాధ్యతలు అప్పగించడం పట్ల పార్టీలో హర్షం వ్యక్తం అవుతోంది అని అంటున్నారు. అలాగే జనసేన శ్రేణులను ఏకమొత్తంగా ముందుకు నడిపించే సామర్థ్యం ఆయనకు ఉందని అంటున్నారు. మొత్తం మీద చూస్తే చాలా కాలం తరువాత స్థానిక సంస్థల ఎన్నికల ముంగిట పవన్ కాకినాడలో తన పార్టీ శ్రేణులతో నిర్వహించే కీలక సమావేశం మీద జనసేన మాత్రమే కాదు ఏపీ రాజకీయ మొత్తం నిశితంగా చూస్తోంది అని అంటున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# టెక్ దిగ్గజంలో మళ్లీ లేఆఫ్స్ కలకలం: ఆపిల్‌లో రెండు నెలల్లో రెండో రౌండ్ ఉద్యోగాల కోతలు.. కారణమిదే..



ప్రపంచ ప్రఖ్యాత ఐఫోన్ తయారీ సంస్థ 'ఆపిల్' ఉద్యోగులకు మరోసారి షాక్ ఇచ్చింది. కేవలం రెండు నెలల వ్యవధిలోనే రెండో రౌండ్ లేఆఫ్స్‌ను చేపడుతూ కంపెనీ తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తాజాగా ఆపిల్‌కు చెందిన ఫిట్ నెస్ ప్లస్ విభాగంలో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులను తొలగించినట్లు ప్రముఖ అంతర్జాతీయ ఆర్థిక వార్తా సంస్థ 'బ్లూమ్‌బర్గ్' తన నివేదికలో వెల్లడించింది.

**ఆడియో కంటెంట్ టీమ్‌పై తీవ్ర ప్రభావం**

బ్లూమ్‌బర్గ్ నివేదిక ఆధారంగా.. గడిచిన వారంలో ఫిట్ నెస్ ప్లస్ విభాగంలోని ఉద్యోగులకు లేఆఫ్స్ నోటీసులు అందాయి. ముఖ్యంగా ఆపిల్ వాచ్ వినియోగదారులకు ఎంతో ప్రియమైన 'టైమ్ టు వాక్' 'టైమ్ టు రన్ ' వంటి ప్రత్యేక ఫీచర్లకు, గైడెడ్ ఆడియో వర్కౌట్ కంటెంట్‌ను రూపొందించే టీమ్‌పై ఈ కోతల ప్రభావం ఎక్కువగా పడింది. వినియోగదారులు స్క్రీన్‌లు చూడాల్సిన అవసరం లేకుండా కేవలం ఆడియో సూచనలతోనే ఫిట్‌నెస్ సాధించేలా ఈ టీమ్ కంటెంట్ డిజైన్ చేసేది. అయితే ఈ రౌండ్‌లో ఎంతమంది ఉద్యోగులు విధులను కోల్పోయారనే దానిపై స్పష్టమైన సంఖ్య బయటకు రాలేదు. ఆపిల్ మేనేజ్‌మెంట్ కూడా దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

**ఫిట్ నెస్ ప్లస్ సేవలు నిలిచిపోతాయా?**

సిబ్బంది సంఖ్యను తగ్గించినంత మాత్రాన ఫిట్ నెస్ ప్లస్ సేవలను ఆపిల్ పూర్తిగా నిలిపివేయడం లేదని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అయితే క్రియేటివ్ ఆడియో టీమ్ పరిమాణం కుదించబడటంతో భవిష్యత్తులో కొత్త ఆడియో వర్కౌట్ కంటెంట్ విడుదల అయ్యే వేగం.. తరచుదనం గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. అంటే వినియోగదారులకు సేవ అందుబాటులోనే ఉన్నప్పటికీ కొత్త అప్‌డేట్‌లు కాస్త ఆలస్యంగా లేదా తక్కువ సంఖ్యలో రావచ్చు.

**ఆగస్టులోనే మొదటి రౌండ్ కోతలు**

ఇదివరకు ఆగస్టు నెలలోనే ఆపిల్ తన వివిధ కీలక విభాగాల్లో భారీగా ఉద్యోగాలను తొలగించింది. అప్పట్లో దాదాపు 200 మందికి పైగా సిబ్బంది ఇంటి బాట పట్టారు. వారిలో విజన్ ప్రో విభాగంలో సుమారు 100 ఉద్యోగాలు... సిరి, ఇతర సాఫ్ట్‌వేర్ టీమ్‌లు 100కు పైగా ఉద్యోగాలు కోల్పోయినట్లు సమాచారం. కంపెనీ పునర్వ్యవస్థీకరణ, యూజర్ ఎక్స్‌పీరియన్స్ అభివృద్ధి విధానంలో వస్తున్న మార్పుల వల్లే ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు ఆపిల్ ఆ సమయంలో వెల్లడించింది. కొన్ని విభాగాల్లో పోస్టులను రద్దు చేస్తూనే మరికొన్ని వ్యూహాత్మక విభాగాల్లో కొత్త ఉద్యోగాలను సృష్టిస్తున్నట్లు పేర్కొంది.

**ఏఐ, హెల్త్ ప్రాజెక్ట్‌లపై ఆపిల్ కొత్త వ్యూహం**

ప్రస్తుతం ఆపిల్ హెల్త్, ఫిట్‌నెస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విభాగాలను మరింత సమగ్రంగా అనుసంధానించే దిశగా అడుగులు వేస్తోంది. యాపిల్ వాచ్ , ఫిట్ నెస్ ప్లస్ సేవలను ఒకే గొడుగు కిందకు తెచ్చి.. ఏఐ ఆధారిత ఫీచర్లతో యూజర్లకు మరింత మెరుగైన అనుభవాన్ని అందించాలని భావిస్తోంది. అందులో భాగంగానే వ్యూహాత్మకంగా కొన్ని సాంప్రదాయ టీమ్‌లను రీ-ఆర్గనైజ్ చేస్తోంది.
మొత్తానికి ఈ లేఆఫ్స్ కేవలం నిధుల పొదుపు చర్యలే కాకుండా.. ఏఐ, హెల్త్ టెక్నాలజీస్, సాఫ్ట్‌వేర్ ప్రాధాన్యతలను మార్చుకునేందుకు ఆపిల్ వేస్తున్న పెద్ద అడుగుగా టెక్ విశ్లేషకులు భావిస్తున్నారు. భవిష్యత్తులో ఫిట్ నెస్ ప్లస్ రూపురేఖలు ఎలా మారనున్నాయో తెలియాలంటే ఆపిల్ నుంచి అధికారిక ప్రకటన వచ్చేవరకు వేచి చూడాల్సిందే.

# 'పనబాక' వారి ఫైర్ మామూలుగా లేదు..షాకింగ్ రీజన్.. !



తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్న నాయకుల జాబితాలో మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి ఉన్నారని అంటున్నారు. ఆమెకు పార్టీ పరంగా ప్రాధాన్యం తగ్గుతోందన్నది అనుచరుల వద్ద ఆమె చెబుతున్నారు. వాస్తవానికి టీడీపీలో ఉన్న పనబాక.. గత ఎన్నికల్లో తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. కానీ, ఓడిపోయారు. ఆ తర్వాత.. అంటే ఏడాదిలోనే.. ఆమెకు తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి బోర్డులో సభ్యత్వం ఇచ్చారు. అయినా.. కూడా తనకు ప్రాధాన్యం తగ్గుతోందని ఆమె వాపోతున్నారట.

**కారణాలు ఇవేనా..?**

పనబాక లక్ష్మి.. ఎప్పుడో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో కేంద్ర సహాయ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత నుంచి ఆమె ఓడిపోతూ వచ్చారు. దీంతో సహజంగానే ఇటు ప్రజల్లోనూ.. అటు పార్టీలోనూ ఆమెకు ప్రాధాన్యం లేకుండా పోయింది. ఇది ప్రధాన అసంతృప్తికి కారణమని తెలుస్తోంది. ఇక, ప్రస్తుతం టీడీపీ లోనే ఉన్న ఆమె.. తనకు అనేక అవకాశాలు వచ్చినా వదులుకున్నానని.. చెబుతున్నారు. 2014 ఎన్నికలకు ముందు వైసీపీ నుంచి ఆమెకు ఆఫర్ వచ్చింది. కానీ.. ఆమె వెళ్లలేదు.ఆ తర్వాత.. ఏపీ కాంగ్రెస్ పార్టీ చీఫ్‌గా వైఎస్ షర్మిల పగ్గాలు చేపట్టారు. ఆ సమయంలోనూ 'ఘర్ వాపసీ' కింద.. పనబాకను రావాలని ఆహ్వానించారు. అంతేకాదు.. రాష్ట్రంలో కీలక పోస్టును కూడా ఆఫర్ చేసినట్టు అప్పట్లో కాంగ్రెస్ నాయకులు చెప్పారు. కానీ.. అప్పట్లోనూ పనబాక రాలేదు. ఇక, గత ఎన్నికల్లో పరాజయం తర్వాత.. పార్టీ తరఫున రాజ్యసభ సీటును ఆశించారు. కానీ.. సమీకరణలు కుదరలేదు. ఆ తర్వాత ఎమ్మెల్సీ పోస్టును కూడా ఆశించారు. కానీ, అది కూడా సాధ్యం కాలేదు.దీంతో అప్పటి నుంచి పనబాక ఫ్యామిలీ అసంతృప్తితోనే ఉందన్నది పార్టీ వర్గాలు చెబుతున్న మాట. మరోవైపు వచ్చే ఎన్నికలకు సంబంధించి ఇప్పటి నుంచే సమీకరణలు మారుతున్నాయి. ఈ నేపథ్యంలో పనబాక.. తిరుపతి పార్లమెంటు స్థానాన్ని కోరుతున్నారు. దీనిపై అంతర్మథనం కూడా చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉందన్న విషయంపై చర్చిస్తున్నారు. అయితే.. టికెట్ విషయంపై ఇప్పుడు ఎందుకు తొందరపడుతున్నారన్నది ప్రశ్న. వచ్చే ఎన్నికలకు తిరుపతి పార్లమెంటు స్థానాన్ని జనసేన ఆశిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో పనబాక ముందుగానే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మరి ఏమేరకు ఆమె అసంతృప్తి చల్లారుతుందో చూడాలి.

# బిహార్‌లో ఘోరం: పదో తరగతి విద్యార్థినిపై మూకుమ్మడి వేధింపులు.. తీవ్రంగా స్పందించిన రాహుల్ గాంధీ



బిహార్‌లోని జముయ్ జిల్లాలో అత్యంత దారుణమైన ఘటన వెలుగు చూసింది. ట్యూషన్ ముగించుకుని ఇంటికి తిరుగుపయనమైన ఇద్దరు పదో తరగతి మైనర్ విద్యార్థులపై కొందరు రౌడీ మూకలు మూకుమ్మడి వేధింపులకు పాల్పడ్డారు. ఈ దారుణానికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర నిరసన జ్వాలలు వ్యక్తమవుతున్నాయి.

**రహదారిపై రెచ్చిపోయిన రౌడీ మూకలు**

పోలీసుల కథనం ప్రకారం.. సెప్టెంబర్ 19వ తేదీ సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో కోచింగ్ క్లాస్ పూర్తయిన తర్వాత ఒక బాలుడు.. బాలిక ద్విచక్రవాహనంపై తిరిగి వెళుండగా కొందరు వ్యక్తులు వారిని అడ్డుకున్నారు. బాలుడిని పక్కకు లాగి దారుణంగా కొట్టిన ఆ మూక.. బాలికను చుట్టుముట్టి అసభ్యంగా ప్రవర్తించింది. ముఖానికి ముసుగు ధరించిన ఒక వ్యక్తి బాలికను బలవంతంగా ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించడం వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. ఆ బాలిక భయంతో కేకలు వేస్తూ.. తమను విడిచిపెట్టాలని ఎంతగా వేడుకున్నా ఆ ఆకతాయిలు వదలకుండా వేధించారు.

**రంగంలోకి దిగిన పోలీసులు.. 'పోక్సో' నమోదు**

సోమవారం ఈ వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం కావడంతో జముయ్ జిల్లా పోలీసులు తక్షణమే స్పందించారు. జముయ్ ఎస్పీ విశ్వజీత్ దయాల్ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. వీడియో ఆధారంగా బాధితులను గుర్తించి వారి నుంచి వాంగ్మూలం సేకరించిన అనంతరం.. నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బాధితులు మైనర్లు కావడంతో నిందితులపై 'పిల్లలపై లైంగిక నేరాల నిరోధక చట్టం' (పోక్సో) లోని సెక్షన్ 8 (లైంగిక దాడి), సెక్షన్ 12 (లైంగిక వేధింపులు) సహా భారతీయ న్యాయ సంహితలోని పలు తీవ్రమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఇప్పటివరకు ఈ ఘటనకు సంబంధించి ముగ్గురిని అరెస్టు చేసినట్లు మిగిలిన నిందితులను గుర్తించేందుకు దర్యాప్తు వేగవంతం చేసినట్లు అధికారులు వెల్లడించారు.

**రాజకీయంగా కలకలం.. రాహుల్ గాంధీ డిమాండ్**

ఈ ఘటనపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా రహదారిపై సాయంత్రం వేళల్లో కూడా ఒక మైనర్ బాలికకు భద్రత లేకపోవడంపై బిహార్ ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. బాధ్యులందరిపై పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు బిహార్ ప్రభుత్వ వర్గాలు కూడా ఈ ఘటనను తీవ్రంగా ఖండించాయి. మంత్రి సునీల్ కుమార్ మాట్లాడుతూ.. బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హామీ ఇచ్చారు. అయితే ఒక్క ఘటనను చూపి రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని అనడం సరికాదని వ్యాఖ్యానించారు.

**బాధితుల గోప్యతపై హెచ్చరికలు**

మైనర్ బాధితుల గోప్యత, గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని మహిళా సంఘాలు, అధికారులు స్పష్టం చేశారు. ఈ అభ్యంతరకరమైన వీడియోను సోషల్ మీడియాలో మరింతగా షేర్ చేయవద్దని ప్రజలకు, నెటిజన్లకు పోలీసులు విజ్ఞప్తి చేశారు. కేసు దర్యాప్తును వేగవంతం చేసి.. నిందితులందరికీ చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చూస్తామని జముయ్ పోలీసులు హామీ ఇచ్చారు.

# అమెరికాలో హెచ్-1బీ వీసాలపై మళ్లీ మొదలైన నిరసనల సెగ.. భారతీయ టెక్ నిపుణుల్లో పెరుగుతున్న ఆందోళన




అమెరికా వీధిల్లో కనిపించిన ఆ ఒక్క దృశ్యం.. దశాబ్దాలుగా ఎన్నో ఆశలతో, కలలతో అక్కడికి వెళ్లిన వేలాది భారతీయ కుటుంబాల గుండెల్లో ఒక రకమైన అభద్రతాభావాన్ని.. నిశ్శబ్ద భయాన్ని నింపేసింది. టెక్సాస్‌లోని ఒక గ్రోసరీ స్టోర్‌లో ఒక వ్యక్తి ధరించిన "జుఅఽ ఎ1దీ, జుఅఽ ఎ4, జుఅఽ ూ్రు" అనే టీ-షర్ట్ కేవలం ఒక గుడ్డ ముక్క మీద రాసిన అక్షరాలు మాత్రమే కాదు.. అది మనవాళ్లు అక్కడి సమాజం కోసం అందిస్తున్న కష్టాన్ని.. సమర్థతను తిరస్కరిస్తూ విసిరిన ఒక మానసిక బాణం. సొంత ఊరిని.. కన్నవారిని విడిచిపెట్టి.. కంటినిండా నిద్రలేకుండా చదువుకుని.. తమ నైపుణ్యంతో అమెరికా టెక్ దిగ్గజాలను నిలబెడుతున్న వేలాది మంది భారతీయ యువతకు ఈ రకమైన వ్యతిరేకత తీవ్ర మనోవేదనను మిగులుస్తోంది.మన దేశం నుంచి వెళ్లే విద్యార్థులు, నిపుణులు అక్కడ ఊరికే ఏదీ పొందడం లేదు. చదువు పూర్తయ్యాక ఓపీటీ ద్వారా దక్కే తాత్కాలిక అవకాశం కోసం.. ఆ తర్వాత హెచ్1బీ వీసా లాటరీలో తమ పేరు వస్తుందో లేదో తెలియని అనిశ్చితి మధ్య అనుక్షణం నలిగిపోతూనే తమ జీవితాలను నిర్మించుకుంటారు. ఇల్లూ వాకిలి వదిలేసి సంస్కృతిని మార్చుకుని.. అక్కడి ఆర్థిక వ్యవస్థకు వేల కోట్ల పన్నులు చెల్లిస్తూ సేవలందిస్తున్నా.. ఇంకా "మీరు మా ఉద్యోగాలను దోచుకుంటున్నారు" అనే మాటలు వినాల్సి రావడం ఎంతటి చేదు నిజం.. 70 శాతానికి పైగా హెచ్-1బీ వీసాలు భారతీయులకే దక్కుతున్నాయనేది మన నిపుణుల ప్రతిభకు నిదర్శనం అయితే అదే విషయం అక్కడ వారిపై ఉన్న ద్వేషానికి, అసూయకు కారణంగా మారడం అత్యంత బాధాకరం.ఇది కేవలం ఉద్యోగం పొందే ఒక వీసా సమస్య మాత్రమే కాదు.. ఒక హెచ్-1బీ ఉద్యోగి వెనుక అతనిపై ఆధారపడిన హెచ్-4 కుటుంబం ఉంటుంది. ఆ భార్యాభర్తలు, వారి పిల్లలు అక్కడి వాతావరణానికి అలవాటుపడి భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో బతుకుతుంటారు. అలాంటి సమయంలో "వీటన్నింటినీ రద్దు చేయాలి" అంటూ బహిరంగంగా ప్రచారం జరుగుతుంటే రోజువారీ జీవితంలో వారు ఎలాంటి మానసిక ఒత్తిడికి గురవుతారో ఊహించడం కష్టం. పెరిగిన వీసా ఫీజులు, కఠినతరమైన చట్టాలు ఒకవైపు వేధిస్తుంటే మరోవైపు ఇలాంటి బహిరంగ నిరసనలు.. ఆన్‌లైన్ ద్వేషం

వారి ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నాయి.అమెరికాను సాంకేతిక ఉన్నతంగా మార్చడంలో భారతీయ రక్తం, చెమట ఎంతో ఉన్నప్పటికీ నేడు వారి స్వంత ఇంట్లోనే వారిని ఆప్యాయంగా చూడకపోవడం.. తమ భవిష్యత్తు ఏ క్షణాన ఏమవుతుందోనన్న భయం భారతీయుల గుండెల్లో నిరంతరం ప్రవహిస్తూనే ఉంది.

# కృష్ణలంక పోలీసుస్టేషన్ కి వైసీపీ కీలక నేతలు.. బెజవాడలో హైటెన్షన్!



డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై ఆందోళన చేసిన వైసీపీ నేతలను విజయవాడ పోలీసులు అరెస్టు చేశారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పార్టీ నేతలు పేర్ని కిట్టూ, అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ తోపాటు పలువురు నాయకులను కృష్ణలంక పోలీసుస్టేషన్ కి తరలించారు. అయితే పోలీసులు తమను అక్రమంగా నిర్బంధించారని ఆరోపిస్తూ వైసీపీ నేతలు పోలీసుస్టేషన్ ఆవరణలో నేలపైనే బైఠాయించారు. శాప్ కార్యాలయం ఎదుట అనుమతి లేకుండా ధర్నా చేశారన్న ఆరోపణలతోపాటు స్పోర్ట్సు కోటాలో ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులపై దాడి చేశారనే అభియోగాలతో వైసీపీ నేతలను అరెస్టు చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

వైసీపీ ఆందోళనతో విజయవాడలో తీవ్ర ఉద్రికత్తలు నెలకొన్నాయి. ఉదయం పది గంటల నుంచి దాదాపు రెండు గంటల పాటు విజయవాడ ప్రధాన రహదారిలో వైసీపీ కార్యకర్తలు వర్సెస్ ఉపాధ్యాయులు తలపడటంతో ఏం జరుగుతుందోనన్న టెన్షన్ కనిపించింది. ప్రధాన రహదారికి అనుకుని ఉన్న ఇందిరా గాంధీ స్టేడియంలో శాప్ కార్యాలయం ఉండగా, శాప్ ఎండీని కలిసేందుకు ఉపాధ్యాయులు వచ్చారు. అదే సమయంలో వైసీపీ నేతల ఆధ్వర్యంలో వందల మంది కార్యకర్తలు ధర్నా చేయడంతో అక్కడ యుద్ధ వాతావరణం కనిపించింది. దీంతో పోలీసులు వైసీపీ కార్యకర్తలను చెదరగొట్టి పలువురు నేతలను అరెస్టు చేశారు.

లబ్బీపేటకు సమీపంలో ఉన్న కృష్ణలంక పోలీసుస్టేషన్ కు వైసీపీ కీలక నేతలు జక్కంపూడి రాజా, పేర్ని కిట్టు, నాగార్జున యాదవ్ తోపాటు మరో పదిహేను మంది నాయకులను తరలించారు. అయితే వీరిపై సాధారణ కేసులు నమోదు చేసి వదిలేస్తారా? లేక పోలీసు విధి నిర్వహణను అడ్డుకున్నారనే కారణంగా రిమాండుకు తరలిస్తారా? అనే విషయం మాత్రం క్లారిటీ కనిపించడం లేదని అంటున్నారు. సాధారణంగా ధర్నా కార్యక్రమాలలో అరెస్టు చేసిన నేతలు, కార్యకర్తలను పోలీసుస్టేషన్ కు తరలించి కొద్దిసేపటి తర్వాత విడిచిపెడతారు.

అయితే శాప్ కార్యాలయం ఎదుట కాస్త ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసు చర్యలు ఎలా ఉంటాయనేది చూడాల్సివుందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.ఇక విజయవాడలో శాప్ కార్యాలయం ఎదుట వైసీపీ ధర్నాను అడ్డుకునేందుకు పోలీసులు విశ్వప్రయత్నం చేశారని చెబుతున్నారు. ధర్నాకు అనుమతి లేదని ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన నాయకులు అందరికీ నోటీసులు జారీ చేశారు. ధర్నాలో పాల్గొనేందుకు గుంటూరు నుంచి వస్తున్న మాజీ మంత్రి అంబటిని మార్గమధ్యలోనే అడ్డుకున్నారు. అదేవిధంగా సీనియర్ నేత పేర్ని నానిని కూడా మచిలీపట్నంలో గృహ నిర్బంధంలో ఉంచినట్లు చెబుతున్నారు. పోలీసులు తీవ్ర నిర్బంధం విధించినప్పటికీ వారి నుంచి తప్పించుకుని జోగి రమేష్, దేవినేని అవినాశ్, జక్కంపూడి రాజా వంటివారు లబ్బీపేటలోని శాప్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. వారికి మద్దతుగా వందల సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు తరలిరావడంతో పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో కాస్త తోపులాట జరగడంతో పోలీసులు స్వల్పంగా లాఠీచార్జి చేశారని అంటున్నారు.

చరిత్ర కొన్నిసార్లు యథాతథంగా కాదు, విచిత్రమైన మలుపుతో తిరిగొస్తుంది. బంగ్లాదేశ్ మాజీ అధ్యక్షుడు జియావుర్ రెహమాన్ భారత్‌తో వ్యూహాత్మక బంధాన్ని తగ్గించుకుంటూ.. పాకిస్తాన్‌తో సంబంధాలను మెరుగుపర్చుకోవాలని ప్రయత్నించి దాదాపు యాభై ఏళ్లు కావస్తోంది. ఇప్పుడు ఆయన కుమారుడు, ప్రధాన మంత్రి తారిక్ రెహమాన్, 'మక్కా ఒప్పందం' ద్వారా పాకిస్తాన్‌తో బంగ్లాదేశ్‌ను మరింత దగ్గర చేసే అసాధారణ మలుపువద్ద నిలబడ్డారు. ఈ ఏడాది ఆగస్టు 7న సౌదీ అరేబియా, టర్కీ, పాకిస్తాన్ దేశాలు మక్కాలో సంతకం చేసిన ఈ త్రైపాక్షిక రక్షణ ఒప్పంద (ఏదైనా ఒక సభ్యదేశంపై సాయుధ దాడి జరిగితే.. దాన్ని మూడు దేశాలపైనా దాడిగా పరిగణించే నాటో తరహా సూత్రం) కూటమిలో చేరాలన్న ఆసక్తిని బంగ్లాదేశ్ విదేశాంగ సలహాదారు హుమాయూన్ కబీర్ ఇప్పటికే బహిరంగంగా వ్యక్తం చేశారు, "పశ్చిమాసియాలో ఇస్లామిక్ దేశాల మధ్య భద్రతా ఏర్పాటుంటే, అందులో మేము పాల్గొనడం అసాధారణం కాదు" అంటూ. సౌదీ యువరాజు ఆహ్వానం మేరకు తారిక్ రెహమాన్ రియాద్ పర్యటన త్వరలో ఖరారు కానుంది. ఈ పరిణామంపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందిస్తూ, "పశ్చిమాసియాలో జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్నాం" అని వ్యాఖ్యానించారు. తరాలమధ్య ఈ పోలిక నిజంగా ఆసక్తికరమైనది. 1971 తర్వాత బంగ్లాదేశ్ సార్వభౌమత్వాన్ని సుస్థిరం చేయడంలో సహకరించిన జియావుర్ రెహమాన్, వ్యూహాత్మక స్థలం కోసం పాకిస్తాన్ వైపు తిరిగారు. మారిన దక్షిణాసియా పరిస్థితుల్లో, ఆయన కుమారుడు ఆ వైవిధ్యీకరణ స్వభావానికి అధికారిక భద్రతా కోణాన్ని జోడించే దిశగా అడుగులేస్తున్నారు!

అయితే బంగ్లాదేశ్ పాకిస్తాన్ వైపు మొగ్గు చూపడంలో విచిత్రమైన మలుపు, ఉద్దేశపూర్వక సవాలూ లేకపోలేదు. పాకిస్తాన్ సైనిక అతిరేకాలు బంగ్లాదేశ్ చరిత్రలో చెరగని అధ్యాయంగా మిగిలిపోయాయి. బంగ్లాదేశ్‌ను ఇప్పుడు నడిపిస్తున్న తారిక్ తండ్రి జియావుర్ రెహమాన్ స్వయంగా ఆ విముక్తి పోరాటంలో బంగ్లాదేశ్ పక్షాన పోరాడిన వ్యక్తి. అయినప్పటికీ, అధ్యక్షుడిగా ఆయన తర్వాత భారత్‌నుంచి వ్యూహాత్మక దూరం కోసం పాకిస్తాన్ వైపు మళ్లారు. ఇప్పుడు తారిక్ ఆ వారసత్వాన్ని పాకిస్తాన్-సంబంధిత భద్రతా ఏర్పాటు ద్వారా మరింత ముందుకు తీసుకెళితే, ఆ సంజ్ఞను కేవలం దౌత్యపరమైన సర్దుబాటుగా కొట్టిపారేయలేం. బంగ్లాదేశ్ విముక్తి కోసం పోరాడిన వ్యక్తి కుమారుడు, బంగ్లాదేశ్ స్వాతంత్ర్యాన్ని అణచివేసిన దేశంవైపు మొగ్గుతూ, ఆ స్వాతంత్ర్యాన్ని సాధ్యం చేసిన పొరుగుదేశానికి ఒక పరోక్ష సందేశాన్ని పంపడం రాజకీయ ప్రతీకాత్మకతను సంతరించుకుంటుంది. తారిక్ ఈ వ్యూహాత్మక మార్గదర్శకాన్ని తన తల్లి ఖలీదా జియా నుంచి కూడా వారసత్వంగా పొందారు. పాకిస్తాన్‌తో వెచ్చని సంబంధాలు, బలమైన ఇస్లామిక్ గుర్తింపును కలిపి, అవామీ లీగ్ యొక్క భారత్ కేంద్రిత దృక్పథం నుంచి బంగ్లాదేశ్‌ను వేరుపరచాలన్న ఆమె రాజకీయ సంప్రదాయం ఇప్పటికీ ప్రభావం చూపుతోంది. ఈ వారసత్వ కోణం నుంచి చూస్తే, మక్కా ఒప్పందం అదనపు ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. అయితే, దీని తక్షణ విలువ ప్రధానంగా సైనిక జోక్యంలో ఉండదు. బంగ్లాదేశ్‌కు

## వారసత్వ మలుపు

టర్కీ, సౌదీ అరేబియా, పాకిస్తాన్‌ల నుంచి భౌగోళిక దూరం, సంప్రదాయ సైనిక జోక్యానికి ఉండే లాజిస్టిక్ కష్టాలు, అలాంటి పరిస్థితిని ఊహించడం కష్టతరం చేస్తాయి. కాబట్టి ఈ ఒప్పందం విలువ, అది సైనికంగా ఏం సాధించగలదు అన్నదానికంటే, ఏం సందేశాన్ని ఇస్తుందన్న దానిలోనే ఎక్కువగా ఉండవచ్చు. అంతర్జాతీయంగా, న్యూఢిల్లీకి మించి ఢాకాకు వ్యూహాత్మక ఎంపికలున్నాయని ఇది సూచిస్తుంది. ప్రాంతీయంగా, వ్యూహాత్మక సమతుల్యతను మార్చగల సంబంధాలకు బంగ్లాదేశ్ సిద్ధంగా ఉందనీ తెలియజేస్తుంది. దేశీయంగా, తల్లిదండ్రుల రాజకీయ వారసత్వానికి వారసుడిగా తారిక్ తనను తాను ప్రదర్శించుకోగలుగుతారు. భారత అతిక్రమణగా భావించే దాన్ని ప్రతిఘటించే జాతీయవాదిగా, అదే సమయంలో విస్తృత ముస్లిం ప్రపంచంలో బంగ్లాదేశ్ స్థానాన్ని పునరుద్ఘాటించే నేతగా.

బంగ్లాదేశ్‌కు ఈ ఒప్పందంలో చేరడం వల్ల భారత్‌తో బేరసారాల్లో మరింత పైచేయి లభించవచ్చు. పాకిస్తాన్, సౌదీ అరేబియా, టర్కీలను తన దౌత్య, భద్రతా లెక్కల్లోకి తీసుకురావడం ద్వారా, తారిక్ బంగ్లాదేశ్ వ్యూహాత్మక ఎంపికలను వైవిధ్యపరచుకుని, తన భౌగోళిక పరిస్థితి, ఆర్థిక ఆధారపడటంలో ఉన్న అసమతుల్యతను తగ్గించుకోగలరు. దీని లక్ష్యం భారత్‌కు వ్యతిరేకంగా ఏర్పడటం కానవసరం లేదు. నీరు, సరిహద్దులు, వాణిజ్యం, రవాణా, ఇంధన సహకారంలో తమ సహకారాన్ని తేలికగా తీసుకోలేమని చాటిచెప్పడమే ఉద్దేశం కావచ్చు. మరో లెక్క కూడా దాగి ఉండొచ్చు. భారత్‌పై ఎక్కువ పైచేయి సాధిస్తే, చైనానుంచి మరింత ఉదారత లభించవచ్చు. ఈ తర్కం త్రిభుజాకారంలో పనిచేస్తుంది. ఢాకాకు ప్రత్యామ్నాయాలున్నాయని న్యూఢిల్లీకి చూపిస్తే, ఆర్థిక సహాయం, మౌలిక వసతులు, రక్షణ సహకారం, సాంకేతికత, రాజకీయ మద్దతు ద్వారా బంగ్లాను మరింత దగ్గరకు తీసుకునే అవకాశాన్ని బీజింగ్ చూడవచ్చు. పోటీ ప్రపంచ ప్రాధాన్యతలతో అమెరికా తీరిక లేకుండా ఉన్న ఈ తరుణంలో, గతంలో అది అందించిన వ్యూహాత్మక, ఆర్థిక ప్రతిసమతూకాన్ని అందించే స్థితిలో లేకపోవడం ఈ లెక్కను మరింత సంబంధితం చేస్తుంది. భారత్, చైనా, ఇతర భాగస్వాముల మధ్య పోటీయే తనకు ఒక ఆస్తిగా బంగ్లాదేశ్ భావిస్తుండవచ్చు. ఢాకా ఎంత అనివార్యంగా మారితే, అంత ఎక్కువ రాయితీలు రాబట్టుకోగలదు. కాబట్టి, తారిక్ లెక్క భారత్‌కు బదులు పాకిస్తాన్‌ను, అమెరికాకు బదులు చైనాను ఎంచుకోవడం గురించి కాదు, ప్రతి పెద్ద శక్తీ బంగ్లాదేశ్ అనుకూలతకు మరింత పోటీపడేలా తగినంత భౌగోళిక రాజకీయ పోటీని సృష్టించడం గురించి కావచ్చు. చివరిగా, ఈ కథలో అత్యంత ముఖ్యమైన కోణమిదే కావచ్చు, బంగ్లాదేశ్‌కు అత్యంత తీవ్రమైన జాతీయ గాయానికి కారణమైన పాకిస్తాన్, ఇప్పుడు 1971లో బంగ్లాదేశ్ ఎందుకోసం పోరాడిందో అదే వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని నొక్కిచెప్పే సాధనంగా మారవచ్చు. సామూహిక రక్షణ గురించినదిగా కనిపించే ఈ ఒప్పందం, బంగ్లాదేశ్‌కు మాత్రం భౌగోళిక పరిస్థితినే రాజకీయంగా తక్కువ నిర్ణాయకంగా మార్చే దౌత్యపరమైన సాధనంగా మారడమే విచిత్రమైన మలుపు కావచ్చు. దీన్ని తారిక్ చివరకు విధానంగా మార్చినా మార్చకపోయినా, న్యూఢిల్లీ మాత్రం బంగ్లాదేశ్‌ను తన వ్యూహాత్మక కక్ష్యలోనే ఉంటుందని ఇకపై భావించలేదన్న సందేశాన్ని ఇప్పటికే అందుకుంది!

### పనికొచ్చే పలుకు




## గృహిణి నుంచి 'గ్రీన్ ఆరా' వరకూ..

కొబ్బరి చెట్టు అనగానే గుర్తొచ్చేది చల్లటి కొబ్బరినీళ్లు, వంటల్లో వాడే తురుము, చట్నీలు మాత్రమే. దక్షిణాది వంటిల్లుకు ఇది నిత్యావసరమే తప్ప, చాలామందికి ఇదొక వ్యాపార అవకాశంగా కనిపించదు. కానీ కేరళకు చెందిన సుమిల జయరాజ్‌కు మాత్రం, ఖాళీ ఇంట్లో మిగిలిన ఒంటరితనమే ఒక కోటి రూపాయల వ్యాపారానికి బీజం వేసింది.

జువాలజీ, ఇంగ్లీష్ లిటరేచర్‌లో పట్టా పుచ్చుకున్న సుమిల, పెళ్లయ్యాక భర్తతో కలిసి ముంబైకి మారారు. కవల పిల్లలు పుట్టడంతో కొన్నేళ్లు పూర్తిగా కుటుంబ బాధ్యతలకే అంకితమయ్యారు. కానీ కాలం అందరినీ ఒకేలా వదిలిపెట్టదు – పిల్లలు ఉన్నత చదువుల కోసం దూరమయ్యారు, భర్త ఉద్యోగం కోసం దుబాయ్ వెళ్లారు. ఇంటి నిండా నిశ్శబ్దమే మిగిలింది. చాలామంది ఈ దశలో బాధపడి ఆగిపోతారు. సుమిల మాత్రం దీన్నొక కొత్త ప్రారంభానికి అవకాశంగా మలుచుకున్నారు.

తనకంటూ ఒక గుర్తింపు కావాలన్న తపనతో, స్థానికంగా వర్జిన్ కోకోనట్ ఆయిల్ తయారుచేసే ఒక చిన్న కంపెనీలో ఉద్యోగంలో చేరారు. అక్కడ కస్టమర్ల సందేహాలు తీర్చడం, విదేశీ క్లయింట్లతో మాట్లాడటం ఆమె పనిలో భాగం. ఈ క్రమంలోనే లండన్ నుంచి కంపెనీకి తొలి ఎగుమతి ఆర్డర్‌ను సాధించి పెట్టారు. అదే ఆమెలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది – "ఇతరుల కోసం చేయగలిగినది, నా కోసం ఎందుకు చేయలేను?" అన్న ప్రశ్న మనసులో మెదిలింది.

ఆలస్యం చేయకుండా ఉద్యోగానికి రాజీనామా చేసిన సుమిల, ఇంటి పక్కనే ఉన్న ఒక చిన్న షెడ్‌లో సొంత తయారీ యూనిట్‌ను ప్రారంభించారు. కొబ్బరిలోని పోషకాలు, యాంటీఆక్సిడెంట్లు దెబ్బతినకుండా ఉండేందుకు 'సెంట్రిఫ్యూగల్ టెక్నాలజీ' వినియోగించి కోల్డ్ ప్రెస్డ్ వర్జిన్ కోకోనట్ ఆయిల్‌ను తయారుచేయడం మొదలుపెట్టారు. బ్యాంకు రుణాలు తిరస్కరించడం, కొత్త ఉత్పత్తికి మార్కెట్ సృష్టించడం – ఈ సవాళ్లేవీ ఆమెను ఆపలేకపోయాయి. చివరికి 2021లో 'గ్రీన్ ఆరా' పేరుతో తన సొంత బ్రాండ్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చారు.

కేవలం కొబ్బరి నూనెకే పరిమితం కాకుండా, చట్నీ పొడులు, పచ్చళ్లు, కొబ్బరి పాల పొడి, సాంబార్ పొడి వంటి విభిన్న ఉత్పత్తులతో తన బ్రాండ్‌ను విస్తరించారు. నేడు 'గ్రీన్ ఆరా' ఉత్పత్తులు భారత్‌లోనే కాకుండా అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, మలేషియా వంటి దేశాలకూ ఎగుమతి అవుతున్నాయి. ఖాళీ ఇంట్లో మిగిలిన ఒంటరితనంతో మొదలైన ఈ ప్రయాణం, ఇవాళ నెలకు సగటున రూ. 20 లక్షల వ్యాపారంగా ఎదిగింది.

గృహిణిగా జీవితం ముగిసిపోయిందని అనుకున్న క్షణంలోనే, సుమిల దాన్ని ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికే మలుపుగా మార్చుకున్నారు. వయసు, కుటుంబ బాధ్యతలు అడ్డంకులుగా అనిపించే ప్రతి ఆమెకూ, ఆలస్యంగా మొదలుపెట్టినా, గమ్యం చేరుకోవచ్చని ఈ కథ నిరూపిస్తోంది.

# చమురుపై చట్టం కొరడా!?

రష్యా చమురు దిగుమతులపై అమెరికా రూపొందించిన కొత్త చట్టం, భారత్-అమెరికా సంబంధాల్లో ఇప్పటివరకూ చూడని కొత్త, తీవ్రస్థాయి ఉద్రిక్తతను తీసుకువచ్చింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సెప్టెంబర్ 18న సంతకం చేసి చట్టంగా మార్చిన 'లిండ్సే ఓ గ్రాహం రష్యా, ఇరాన్‌లపై ఆంక్షల చట్టం -2026', రష్యానుంచి భారీ మొత్తంలో చమురు, గ్యాస్ దిగుమతి చేసుకునే భారత్‌వంటి దేశాలపై వంద శాతం వరకూ సుంకాలు విధించే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడికి కట్టబెడుతుంది. ఈ చట్టానికి సెనేట్‌లో 86-11 ఓట్లతో, ప్రతినిధుల సభలో 262-159 ఓట్లతో భారీ మెజారిటీ లభించింది. ఇంతటి ద్విపక్ష మద్దతు అమెరికా రాజకీయాల్లో అరుదైన విషయం, ముఖ్యంగా ట్రంప్ హయాంలో ఇది మరింత విశేషమైనది. ఈ బిల్లును ముందుండి నడిపించిన సెనేటర్ లిండ్సే గ్రాహం, ఈ ఏడాది జులైలో మరణించగా, ఆయన పేరుమీదే చట్టాన్ని రూపొందించారు. ఇది ఉక్రెయిన్ యుద్ధాన్ని పోషిస్తున్న రష్యా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయాలన్న అమెరికా చట్టసభల దీర్ఘకాలిక ప్రయత్నానికి ఇప్పటివరకూ అత్యంత బలమైన అడుగుగా చెప్పుకోవచ్చు. గతంలో ట్రంప్ విధించిన ప్రతీకాత్మక సుంకాల కంటే ఇది మరింత తీవ్రమైనది, శాశ్వతమైనది కూడా. గత ఏడాది రష్యా చమురు దిగుమతులపై భారత్‌కు విధించిన 50 శాతం ప్రతీకార సుంకాలు కేవలం ఒక కార్యనిర్వాహక ఉత్తర్వు (ఎగ్జిక్యూటివ్ ఆర్డర్) ద్వారా అమల్లోకి వచ్చాయి కాబట్టి, అదే పద్ధతిలో వాటిని ఉపసంహరించుకోవడం సాధ్యమైంది. వాస్తవానికి ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆ 25 శాతం అదనపు సుంకాన్ని అమెరికాయే ఉపసంహరించుకుంది కూడా. కానీ ఈ కొత్త చట్టం అమెరికా కాంగ్రెస్ ఆమోదంతో వచ్చినది కాబట్టి, దీనికి చట్టబద్ధమైన, శాశ్వతమైన బలం ఎక్కువ. ఈ చట్టం నుంచి ఏదైనా మినహాయింపు ఇవ్వాలంటే, దానికి తగిన కారణాలను వివరిస్తూ ట్రంప్ కాంగ్రెస్‌కు లిఖితపూర్వకంగా సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఇది ఆయన నిర్ణయాధికారంపై ఒక నిర్దుష్ట పరిమితిని విధిస్తుంది, గతంలో మాదిరిగా ఒక్క సంతకంతో అన్నీ మార్చేసే వెసులుబాటు ఇకపై ఉండదు.

గత ఏడాది విధించిన 50 శాతం సుంకాలు భారత ఎగుమతులను తీవ్రంగా దెబ్బతీసినప్పటికీ, ఆ భారాన్ని ఎగుమతిదారులు తమ అమెరికన్ కస్టమర్లతో పంచుకోవడం ద్వారా కొంతమేర ప్రభావాన్ని తగ్గించుకోగలిగారు. అయితే ఇది ఆర్థికంగా చాలా ఇబ్బందికరమైన, ఎక్కువకాలం కొనసాగించలేని ఏర్పాటు, లాభాల మార్జిన్‌ను తగ్గించుకుని కస్టమర్లను నిలుపుకోవడం అనేది శాశ్వత పరిష్కారం కాదు. ఇప్పుడు వందశాతం సుంకాన్ని ఇదేవిధంగా పంచుకోవడం, ప్రధానంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) ఎగుమతిదారులకు పూర్తిగా అసాధ్యమైన విషయం. వీరికి పెద్ద కంపెనీల మాదిరిగా నష్టాలను భరించే ఆర్థిక సామర్థ్యంగానీ, ప్రత్యామ్నాయ మార్కెట్లను వెతుక్కునే వనరులుగానీ ఉండవు. ఇప్పటికే అమల్లో ఉన్న 10 శాతం 'బలవంతపు కార్మిక' సుంకం, ఉక్కు-అల్యూమినియంపై 50 శాతం సెక్షన్ 232 సుంకాలకు అదనంగా ఈ వంద శాతం సుంకం వస్తే, భారత ఎగుమతులు అమెరికా మార్కెట్లో పోటీపడలేని స్థితికి చేరుకుంటాయి. వాస్తవానికి కొన్ని ఉత్పత్తుల విషయంలో సుంకాల మొత్తం, ఉత్పత్తి విలువను మించిపోయే




ప్రమాదం కూడా ఉంది. ఈ నేపథ్యంలో భారత్ ముందు మూడు మార్గాలు ఉన్నాయి. రష్యా చమురు దిగుమతులను తగ్గించుకోవడం, ఆ దిగుమతులను కొనసాగిస్తూనే సుంకాలను భరించడం, లేదా చట్టంలోని "వంద శాతం వరకూ" అనే పదజాలాన్ని ఉపయోగించి తక్కువ సుంకం విధించేలా అమెరికాను ఒప్పించడం. మూడు మార్గాలూ తమదైన సవాళ్లతో కూడుకున్నవే. రష్యా చమురు దిగుమతులను కొనసాగిస్తూ సుంకాలను భరించే మార్గం, భారత ఎగుమతి లక్ష్యాలకు, ఎంఎస్‌ఎంఈ రంగానికి పెద్ద దెబ్బగా మారుతుంది. మొత్తం భారత వస్తు ఎగుమతుల్లో దాదాపు 20 శాతం వాటా అమెరికాదే కావడంతో, ఆ మార్కెట్‌ను నిర్లక్ష్యం చేయడం సాధ్యం కాదు. అంతేకాక, గతంలో అనేకసార్లు రుజువైనట్టు, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి గురించి గట్టిగా మాట్లాడినప్పటికీ, నిర్దిష్ట దేశాల నుంచి చమురు కొనుగోళ్లను తగ్గించుకోవాలన్న అమెరికా ఒత్తిడికి భారత్ సాధారణంగా అనుగుణంగానే వ్యవహరించిన చరిత్ర ఉంది.

ప్రత్యామ్నాయ చమురు వనరులను వెతుక్కోవడం అంత సులభమైన పని కాదు. 2026 జులై నాటికి భారత చమురు దిగుమతుల్లో రష్యా వాటా 51 శాతానికి పైగా ఉండగా, హర్మూజ్ జలసంధి గుండా సరఫరాలు ఇప్పటికీ పరిమితంగానే ఉన్నాయి. ప్రత్యామ్నాయ ఓడరేవుల విస్తరణను వేగవంతం చేయాలంటూ ఒమన్‌వంటి దేశాలపై భారత్ ఒత్తిడి తేవాల్సి ఉంటుంది. ముడిచమురు ధర ఇప్పటికీ బ్యారెల్‌కు 100 డాలర్లకు మించి ఉండటంతో, కొత్త సరఫరాదారులతో అనుకూలమైన ఒప్పందాలు కుదుర్చుకోవడం రోజురోజుకూ కష్టతరమవుతోంది. ఈ నెలాఖరులో జి-20 వాణిజ్య మంత్రుల సదస్సు కోసం అమెరికా వెళ్లనున్న కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌కు ఇది కీలకమైన పరీక్షగా మారనుంది. దౌత్యపరమైన చాకచక్యంతో ఎంతమేర ఉపశమనం సాధించగలరన్నదే ఇప్పుడు అసలు సవాలు. సుంకాలు అమల్లోకి రావడానికి ఇంకా 30 రోజుల సమయం ఉంది. తక్కువ సుంకం రేటును సాధించగలగడం, ప్రధాని నరేంద్ర మోదీ-ట్రంప్ మధ్య ఉన్న వ్యక్తిగత సాన్నిహిత్యానికి నిజమైన పరీక్షగా నిలవనుంది. వ్యక్తిగత సంబంధాలు ఎంతవరకూ విధానపరమైన కఠినతను మెత్తబరచగలవో ఇప్పుడు రుజువు కావాల్సి ఉంది. ఇది కేవలం భారత్‌కే పరిమితమైన సవాలు కాదు, రష్యా ఇంధనం కొనుగోలు చేసే అతిపెద్ద ఐదు దేశాల్లో చైనా కూడా ఉండటంతో, బీజింగ్ కూడా ఇదే సవాలును ఎదుర్కోనుంది. అంతర్జాతీయ చట్టాలను తన సరిహద్దులకు మించి విస్తరించుకుంటోందంటూ అమెరికాపై చైనా ఇప్పటికే విమర్శలు గుప్పిస్తోంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఈ చట్టాన్ని "అత్యంత కీలకమైనది"గా అభివర్ణిస్తూ ట్రంప్‌కు కృతజ్ఞతలు తెలుపగా, రష్యా క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ దీన్ని "అమిత్రపూర్వక చర్య"గా అభివర్ణించారు. మొత్తంగా చూస్తే, ఈ చట్టం కేవలం ఒక తాత్కాలిక దౌత్య ఒత్తిడి కాదు, శాశ్వత చట్టబద్ధత కలిగిన ఒక దీర్ఘకాలిక సవాలు. దీన్ని ఎదుర్కోవడంలో భారత్ చూపే వ్యూహాత్మక చాకచక్యం, రాబోయే నెలల్లో దేశ ఆర్థిక వ్యవస్థ, దౌత్య సంబంధాల భవిష్యత్తును నిర్ణయించనుంది. తొందరపాటు నిర్ణయాలకు బదులు, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని, సమతుల్యమైన వ్యూహంతో ముందుకు సాగడమే భారత్‌కు మేలు చేస్తుందనడంలో ఎలాంటి సందేహాలు అక్కర్లేదు. ■



వయసు పెరిగే కొద్దీ మనకు నిజం బోధపడుతుంది - ప్రశాంతమైన ఇల్లు, ఆరోగ్యకరమైన శరీరం, అర్థవంతమైన పని, ప్రేమించే మనుషులే జీవితంలో అసలైన సంపదలని. బ్యాంకు బ్యాలెన్స్ పెరిగినా మనసులో నెమ్మది లేకపోతే అదో శిక్షే. పెద్ద భవంతులు, ఖరీదైన వస్తువులు క్షణికమైన సంతోషాన్నివ్వొచ్చేమో గానీ, రాత్రి ప్రశాంతంగా నిద్రపోయే భరోసా ఇవ్వలేవు. చివరికి డబ్బుతో ఇల్లు కొనగలం, కానీ మనశ్శాంతిని కొనలేం. అందుకే, జీవితం చివరిదశలో మిగిలేది బ్యాంకు లెక్కలు కాదు - మనతో నిలబడిన మనుషులు, మనం నమ్మిన సంబంధాలే.

-మహాదేవ

### వింతల్లో వింతలు

## వీడెవడండీ బాబూ..!



కళ్లు కనిపించవు. లైసెన్స్ లేదు. పైగా ఫుల్‌గా మందుకొట్టి ఉన్నాడు, అయినా ఇంగ్లండ్‌లోని ఈ 50 ఏళ్ల వ్యక్తి కారు ఎక్కి ఏకంగా 150 మైళ్లు హైవేపై దూసుకుపోయాడు! పార్ట్‌నర్‌తో నాలుగు వైన్ బాటిళ్లు కొట్టేసిన తర్వాత, బాధలు మర్చిపోదామని స్కాట్‌లాండ్ వైపు బయల్దేరిన ఇతను, ముందు వెళ్తున్న లారీ టెయిల్ లైట్లను వెంబడిస్తూ దారి కనిపెట్టుకున్నాడట! మధ్యలో పెట్రోల్ బంకులో ఆగినా, సిబ్బంది కూడా ఇతని మత్తు, అంధత్వం రెండూ గమనించలేదు. లేన్లు మారుతూ, రోడ్డు పక్కకు వెళ్తూ కూడా యాక్సిడెంట్ కాకపోవడం అదృష్టమే! చివరికి పోలీసులకు దొరికిన ఇతనికి.. కోర్టు 36 వారాల జైలు శిక్ష విధించి సస్పెండ్ చేసింది. బతికి బట్టకట్టడమే అతని అసలు 'డ్రైవింగ్ లైసెన్స్'!

## బాదంపప్పు, వాల్‌నట్స్ వంటి గింజలను ఎక్కువ కాలం పాటు ఇలా నిల్వ చేయండి..



గింజలు (నట్స్) ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఆహారాల్లో ఒకటి. బాదం, పిస్తా, అక్రోట్స్ వంటి నట్స్‌లో విటమిన్లు, ఖనిజాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు సమృద్ధిగా ఉంటాయి. అయితే వీటి పూర్తి ప్రయోజనాలను పొందాలంటే సరైన పరిమాణంలో తీసుకోవడంతో పాటు వాటిని సరిగ్గా నిల్వ చేయడం కూడా చాలా ముఖ్యం. తేమ, వేడి, గాలి ప్రభావానికి గురైతే నట్స్ త్వరగా పాడైపోయే అవకాశం ఉంటుంది. తయారీ తేదీ, నిల్వ చేసే ఉష్ణోగ్రత వంటి అంశాలు కూడా వాటి నిల్వ కాలాన్ని ప్రభావితం చేస్తాయి. కొన్ని సులభమైన జాగ్రత్తలు పాటిస్తే నట్స్‌ను ఎక్కువకాలం తాజాగా ఉంచుకోవచ్చు. ముందుగా నట్స్‌ను తాజాగా కొనుగోలు చేయడం మంచిది. ఒకేసారి ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేయడం కంటే కొన్ని వారాల్లో వినియోగించగలిగేంత పరిమాణంలో కొనడం ఉత్తమం. ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేసిన నట్స్‌ను సరిగా నిల్వ చేయకపోతే వేడి కారణంగా త్వరగా పాడయ్యే అవకాశం ఉంటుంది. కొనుగోలు చేసే ముందు వీలైతే వాటి తాజాదనాన్ని రుచి చూసి నిర్ధారించుకోవడం మంచిది.


### తేమ వెళ్లకుండా..

నట్స్‌ను గాలి చొరబడని డబ్బాల్లో నిల్వ చేయడం ఉత్తమ మార్గం. గాలి లోపలికి వెళ్లకుండా ఉండటం వల్ల అవి ఎక్కువకాలం తాజాగా ఉంటాయి. ముఖ్యంగా బాదం, అక్రోట్స్ వంటి నట్స్ బయట వాసనలను సులభంగా పీల్చుకునే స్వభావం కలిగి ఉంటాయి. గాలి చొరబడని కంటైనర్లు ఈ సమస్యను నివారించడంలో సహాయపడతాయి. నట్స్‌ను ఎప్పుడూ చల్లని, పొడి ప్రదేశంలో ఉంచాలి. స్టవ్ పైన ఉన్న కిచెన్ క్యాబినెట్‌లలో లేదా అధిక వేడి ఉండే ప్రదేశాల్లో నిల్వ చేయడం మంచిది కాదు. అధిక ఉష్ణోగ్రతలకు గురైతే నట్స్ త్వరగా పాడై రుచి మారిపోతుంది. అలాగే నిల్వ చేసే ముందు అవి పూర్తిగా పొడిగా ఉన్నాయో లేదో కూడా నిర్ధారించుకోవాలి.

### రుచి తగ్గినట్లు అనిపిస్తే..

నట్స్ కొద్దిగా పాతబడి రుచి తగ్గినట్లు అనిపిస్తే, వాటిని ఓవెన్‌లో కొన్ని నిమిషాలు స్వల్పంగా వేడి చేయవచ్చు. ఇలా చేయడం వల్ల వాటి సహజ రుచి కొంతవరకు తిరిగి వచ్చే అవకాశం ఉంటుంది. అయితే నట్స్‌లోని సహజ నూనెలు పూర్తిగా చెడిపోయి ఉంటే ఈ పద్ధతి ఉపయోగపడదు. ఈ చిన్నచిన్న జాగ్రత్తలు పాటించడం ద్వారా నట్స్‌ను ఎక్కువకాలం తాజాగా ఉంచుకోవడంతోపాటు వాటి రుచి, నాణ్యతను కూడా కాపాడుకోవచ్చు.

## మధుమేహం ఉన్నవారికి వరం విటమిన్ డి.. సైంటిస్టుల అధ్యయనంలో వెల్లడి..



విటమిన్ డి శరీరానికి అత్యంత అవసరమైన పోషకాలలో ఒకటి. దీనిని సన్‌షైన్ విటమిన్ అని కూడా పిలుస్తారు. ఎముకల ఆరోగ్యంతోపాటు శరీరంలోని అనేక కీలక వ్యవస్థలు సక్రమంగా పనిచేయడానికి ఇది అవసరం. ఒక అధ్యయనం ప్రకారం విటమిన్ డి క్లోమగ్రంథి (ప్యాంక్రియాస్)లో ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసి, నిల్వ చేసి, విడుదల చేసే బీటా కణాల పనితీరును మెరుగుపరచడంలో సహాయపడే అవకాశం ఉందని పరిశోధకులు గుర్తించారు. దీంతో మధుమేహం చికిత్సలో విటమిన్ డి పాత్రపై కొత్త ఆశలు కనిపిస్తున్నాయి. పరిశోధకుల ప్రకారం శరీరంలో విటమిన్ డి స్థాయిలు ఎక్కువగా ఉండటం వల్ల మధుమేహం వచ్చే ప్రమాదం తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. విటమిన్ డి రిసెప్టర్‌ను చురుకుగా చేయడం ద్వారా శరీరంలోని వాపులను తగ్గించే జన్యువుల పనితీరు మెరుగుపడి, ఒత్తిడిలో కూడా బీటా కణాలు మనుగడ సాగించేందుకు తోడ్పడతాయని అధ్యయనం పేర్కొంది. అయితే కేవలం విటమిన్ డి ఒక్కటే బీటా కణాలను పూర్తిగా రక్షించలేదని కూడా పరిశోధకులు వెల్లడించారు.

### సూర్యకాంతి తగలాలి..

శరీరంలో విటమిన్ డి లోపం రాకుండా ఉండాలంటే ప్రతిరోజూ కొంతసేపు సూర్యరశ్మిలో గడపడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. రోజుకు కనీసం ఐదు నిమిషాలపాటు ఎండలో ఉండటం వల్ల చర్మంలో ఉండే కొలెస్ట్రాల్‌పై సూర్యుని అతినీలలోహిత కిరణాలు ప్రభావం చూపి విటమిన్ డిగా మారుతుంది. అలాగే వారానికి కనీసం మూడు రోజులైనా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య సూర్యరశ్మి శరీరానికి అందితే విటమిన్ డి స్థాయిలు పెరగడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఆహారంలో విటమిన్ డి సమృద్ధిగా ఉండే పదార్థాలను చేర్చుకోవడం కూడా అవసరం. ముఖ్యంగా పుట్టగొడుగులు, గుడ్డు పచ్చసొన, కాడ్ లివర్ ఆయిల్, కొవ్వు ఎక్కువగా ఉండే చేపలు వంటి ఆహారాల్లో విటమిన్ డి లభిస్తుంది.

### ఈ ఆహారాలను తీసుకుంటే..

సోయా పాలు, మజ్జిగ వంటి పానీయాలను రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం కూడా విటమిన్ డి అందించడంలో సహాయపడుతుందని పేర్కొన్నారు. అయితే ఇతర విటమిన్ డి ఫోర్టిఫైడ్ పానీయాలను తీసుకునే ముందు పోషకాహార నిపుణుల సలహా తీసుకోవడం మంచిది. విటమిన్ డి లోపం ఉన్నట్లు వైద్య పరీక్షల్లో నిర్ధారణ అయినప్పుడు మాత్రమే వైద్యుల పర్యవేక్షణలో విటమిన్ డి సప్లిమెంట్లను తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. స్వయంగా మందులు వాడటం ఆరోగ్యానికి హానికరమవుతుందని హెచ్చరిస్తున్నారు. విటమిన్ డి ఎక్కువగా కాడ్ లివర్ ఫిష్ ఆయిల్, ఎండబెట్టిన షిటాకే పుట్టగొడుగులు, గుడ్లు, పూర్తి పాలతో తయారుచేసిన మజ్జిగ, చెడార్ లేదా పార్మెసన్ చీజ్ వంటి ఆహారాల్లో లభిస్తుంది. వీటిని తీసుకోవడం ద్వారా మనం తగినంత విటమిన్ డి ని పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.

## వయస్సు పెరుగుతున్న కొద్దీ చర్మంపై కనిపించే ముడతలను ఇలా తగ్గించుకోండి

వయసు పెరుగుతున్న కొద్దీ చర్మంపై ముడతలు కనిపించడం సహజం. అయితే కేవలం వయసే కాదు, చర్మంలో తేమ తగ్గడం, స్థితిస్థాపకత (ఎలాస్టిసిటీ) కోల్పోవడం, అధిక సూర్యరశ్మి, కాలుష్యం, ధూమపానం, అలాగే పోషకాహార లోపాలు కూడా ముడతలు త్వరగా రావడానికి కారణమవుతాయి. చాలా మంది వీటిని తగ్గించేందుకు ఖరీదైన యాంటీ ఏజింగ్ క్రీములను ఉపయోగిస్తుంటారు. అయితే ఇంట్లోనే లభించే కొన్ని సహజ పదార్థాలతో కూడా చర్మ సంరక్షణ చేసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అదే సమయంలో సమతుల్యమైన ఆహారం తీసుకోవడం, తగినంత నీరు తాగడం కూడా ఎంతో ముఖ్యమని చెబుతున్నారు. మొట్టమొదటగా గుడ్డు తెల్లసొనను ఉపయోగించవచ్చు. ఒక గిన్నెలో గుడ్డు తెల్లసొనను బాగా గిలక్కొట్టి నేరుగా ముఖంపై రాసి, మృదువుగా మసాజ్ చేయాలి. సుమారు 15 నిమిషాలు లేదా పూర్తిగా ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇందులో ఉండే ప్రోటీన్, విటమిన్ బి, విటమిన్ ఇ చర్మాన్ని పోషించి ముడతలను తగ్గించడంలో సహాయపడతాయి.



### ఆలివ్ ఆయిల్, నిమ్మరసం..

ఆలివ్ ఆయిల్ కూడా చర్మానికి మంచి సహజ మాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది. రాత్రి నిద్రపోయే ముందు కొన్ని చుక్కల ఆలివ్ ఆయిల్‌ను ముఖంపై మృదువుగా మసాజ్ చేసి, అదనంగా ఉన్న నూనెను మృదువైన వస్త్రంతో తుడవాలి. ఇలా చేయడం వల్ల ఉదయానికి చర్మం మరింత మృదువుగా, తేమతో కనిపించే అవకాశం ఉంటుంది. నిమ్మరసంలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. కొద్దిగా నిమ్మరసాన్ని ముడతలు ఉన్న ప్రాంతాల్లో రాసి సున్నితంగా మసాజ్ చేయవచ్చు. ఇది చర్మాన్ని కాంతివంతంగా కనిపించేలా చేయడంలో తోడ్పడుతుంది. అయితే నిమ్మరసం ఆమ్ల గుణాలు కలిగి ఉండటంతో ఎక్కువగా లేదా తరచూ ఉపయోగించకుండా జాగ్రత్త వహించాలి. అలోవెరా జెల్‌లో ఉండే మాలిక్ యాసిడ్ చర్మ స్థితిస్థాపకతను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. తాజా అలోవెరా ఆకులోని జెల్‌ను తీసి ముఖంపై రాసి 15 నిమిషాల తర్వాత కడిగేయాలి. లేదా విటమిన్ ఇ ఆయిల్‌తో కలిపి కూడా ఉపయోగించవచ్చు.

### అరటి పండు, క్యారెట్లు..

అరటిపండులోని పోషకాలు కూడా చర్మానికి మేలు చేస్తాయి. రెండు అరటిపండ్లను మెత్తగా మెదిపి పేస్ట్‌లా చేసి ముఖంపై రాసి సుమారు అరగంట తర్వాత కడిగేయాలి. కావాలంటే తేనె, అవకాడోతో కలిపి కూడా ఉపయోగించవచ్చు. క్యారెట్‌లో విటమిన్ ఎ పుష్కలంగా ఉంటుంది. ఇది కొల్లాజెన్ ఉత్పత్తికి తోడ్పడి చర్మాన్ని మృదువుగా ఉంచడంలో సహాయపడుతుంది. ఉడికించిన క్యారెట్‌ను తేనెతో కలిపి పేస్ట్ చేసి ముఖానికి పట్టించి అరగంట తర్వాత కడిగేయాలి. అలాగే క్యారెట్‌ను నేరుగా ఆహారంగా తీసుకోవడం కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. అనాసపండులో ఉండే ఎంజైములు చర్మానికి తేమను అందించడంతో పాటు చనిపోయిన కణాలను తొలగించడంలో సహాయపడతాయి. అనాసపండు ముక్కను నేరుగా ముఖంపై రుద్ది 20 నిమిషాల తర్వాత చల్లటి నీటితో కడిగేయాలి. చర్మ ఆరోగ్యానికి అత్యంత సులభమైన మార్గం తగినంత నీరు తాగడం. రోజుకు కనీసం రెండు లీటర్ల నీరు తాగడం వల్ల శరీరం, చర్మం తేమను నిల్వ చేసుకోవడానికి సహాయపడుతుంది. దీంతో చర్మం తాజాగా, ఆరోగ్యంగా కనిపించే అవకాశాలు మెరుగుపడతాయి.

## పులిపిర్లను తగ్గించే ఇంటి చిట్కాలు.. ఇలా చేస్తే సమస్య తగ్గుతుంది..

చర్మంపై కనిపించే చిన్న గుండ్రని లేదా అండాకార పెరుగుదలలను పులిపిర్లు (వార్ట్స్) అంటారు. ఇది వైరల్ ఇన్‌ఫెక్షన్ కారణంగా ఏర్పడే సాధారణ చర్మ సమస్య. సాధారణంగా నొప్పి ఉండకపోయినా, కొన్ని సందర్భాల్లో అసౌకర్యం లేదా నొప్పిని కలిగిస్తాయి. చేతులు, కాళ్లు, జననేంద్రియాలపై కూడా ఇవి కనిపించే అవకాశం ఉంటుంది. వైద్యులు అవసరాన్ని బట్టి శస్త్రచికిత్స లేదా క్రయోథెరపీ వంటి చికిత్సలను సూచిస్తారు. అయితే ప్రారంభ దశలో కొన్ని సహజ పదార్థాలను ఉపయోగించడం వల్ల కొంతమందికి ఉపశమనం కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. అలోవెరా (కలబంద) జెల్‌ను నేరుగా పులిపిర్లపై రాయడం వల్ల ప్రయోజనం కలుగుతుందని పేర్కొంటున్నారు. కలబందలో ఉండే మాలిక్ యాసిడ్ చర్మాన్ని పునరుద్ధరించడంలో, వార్ట్‌లను క్రమంగా తగ్గించడంలో సహాయపడుతుంది.



### బేకింగ్ పౌడర్, యాపిల్ సైడర్ వెనిగర్..

బేకింగ్ పౌడర్‌ను ఆముదం నూనెతో కలిపి పేస్ట్‌లా తయారు చేసి రాత్రి సమయంలో వార్ట్‌లపై రాసి, బ్యాండేజ్‌తో కప్పాలి. ఇలా ప్రతిరోజూ చేయడం వల్ల వార్ట్ లు క్రమంగా తగ్గే అవకాశం ఉంటుంది. యాపిల్ సైడర్ వెనిగర్‌లో ఉండే అసిటిక్ యాసిడ్ వార్ట్ ల కణజాలాన్ని క్రమంగా దెబ్బతీయడంలో సహాయపడుతుంది. కాటన్‌ను వెనిగర్‌లో ముంచి వార్ట్‌లపై ఉంచి, అతికే బ్యాండేజ్‌తో రాత్రంతా అలాగే ఉంచాలి. అరటి తొక్కలో ఉండే ఎంజైమ్‌లు చర్మాన్ని పునరుత్తేజపరచడంలో సహాయపడతాయి. అలాగే ఇందులో యాంటీ మైక్రోబియల్ గుణాలు కూడా ఉంటాయి. ప్రతిరోజూ కొన్ని నిమిషాల పాటు అరటి తొక్క లోపలి భాగంతో వార్ట్‌లపై నెమ్మదిగా రుద్దడం వల్ల ప్రయోజనం కలుగుతుంది. వెల్లుల్లిలో ఉండే అల్లిసిన్ అనే పదార్థం శక్తివంతమైన యాంటీ మైక్రోబియల్ గుణాలను కలిగి ఉంటుంది. ఇది బ్యాక్టీరియా, శిలీంధ్రాలు, వైరస్‌లపై ప్రభావం చూపుతుంది. కొన్ని వెల్లుల్లి రెబ్బలను దంచి వార్ట్‌లపై రాయడం వల్ల వైరల్ ఇన్‌ఫెక్షన్ తగ్గడంలో సహాయపడతాయి. వెల్లుల్లిని ఆహారంలో భాగంగా తీసుకోవడం కూడా ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

### పసుపు, లవంగ నూనె..

పసుపును కొద్దిగా నీటితో కలిపి పేస్ట్‌లా చేసి వార్ట్‌లపై రాసి సుమారు అరగంట తర్వాత కడిగేయాలి. పసుపులో ఉండే యాంటీ మైక్రోబియల్ గుణాలు ఇన్‌ఫెక్షన్‌ను తగ్గించడంలో, వార్ట్‌లను తొలగించడంలో సహాయపడతాయి. పసుపు వల్ల చర్మంపై ఏర్పడే పసుపు రంగును నిమ్మకాయ ముక్కతో నెమ్మదిగా రుద్ది తొలగించవచ్చు. లవంగ నూనెను వార్ట్‌లపై రాసి బ్యాండ్ ఎయిడ్‌తో కప్పాలి. ఇలా క్రమం తప్పకుండా చేయడం వల్ల వార్ట్ లు తగ్గే అవకాశం ఉంటుంది. లవంగ నూనెలో ఉండే యూజెనిన్ అనే సమ్మేళనం యాంటీ వైరల్ గుణాలను కలిగి ఉండి వైరస్ వ్యాప్తిని నిరోధించడంలో సహాయపడుతుంది. అయితే వార్ట్స్ పరిమాణం పెరగడం, నొప్పి, రక్తస్రావం లేదా జననేంద్రియాలపై కనిపించడం వంటి పరిస్థితుల్లో ఇంటి చిట్కాలపై మాత్రమే ఆధారపడకుండా చర్మవ్యాధి నిపుణులను సంప్రదించడం అవసరం.

## గోల్డ్ మెడల్ పోరులో భారత్ vs శ్రీలంక: ఆసియా గేమ్స్ ఫైనల్ మ్యాచ్ ఎప్పుడు, ఎక్కడ చూడాలంటే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా గేమ్స్ 2026 మహిళల క్రికెట్ విభాగంలో అత్యంత కీలక ఘట్టం ఆసన్నమైంది. పసిడి పతకం కోసం డిఫెండింగ్ ఛాంపియన్ భారత మహిళల క్రికెట్ జట్టు శ్రీలంక మహిళల జట్టు (మంగళవారం, సెప్టెంబర్ 22) హోరాహోరీగా తలపడనున్నాయి. జపాన్‌లోని నిషిన్‌లో ఉన్న కోరోగి స్పోర్ట్స్ పార్క్ వేదికగా ఈ చారిత్రాత్మక ఫైనల్ పోరు జరగనుంది.

**అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు భారత్, లంక:**

భారత్ ఘన విజయం: బంగ్లాదేశ్‌తో జరిగిన సెమీఫైనల్‌లో ఓపెనర్ షెఫాలీ వర్మ కేవలం 49 బంతుల్లోనే అజేయంగా 100 పరుగులు చేసి రికార్డు సెంచరీతో విరుచుకుపడింది. దీంతో భారత్ 20 ఓవర్లలో 195/4 పరుగులు చేయగా.. బంగ్లాదేశ్‌ను 81 పరుగులకే ఆలౌట్ చేసి 114 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఇదే మ్యాచ్‌లో స్మృతి మంధాన మహిళల టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా ప్రపంచ రికార్డు సృష్టించింది.

శ్రీలంక ఊచకోత: పాకిస్థాన్‌తో జరిగిన మరో సెమీఫైనల్‌లో శ్రీలంక కెప్టెన్ చమరి అతపత్తు (50 బంతుల్లో 83 నాటౌట్) చెలరేగడంతో 178 పరుగుల భారీ లక్ష్యాన్ని కేవలం 2 వికెట్లు కోల్పోయి ఛేజ్ చేసింది.

**మరోసారి ఆసియా కప్ రిపీట్:**

ఈనెల ఆరంభంలో దుబాయ్‌లో జరిగిన మహిళల ఆసియా కప్ 2026 ఫైనల్‌లోనూ భారత్ వర్సెస్ శ్రీలంక జట్లే పోటీపడ్డాయి. ఆ మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించి ట్రోఫీ గెలుచుకుంది. ఇప్పుడు ఆసియా గేమ్స్ ఫైనల్లోనూ ఈ రెండు జట్లు తలపడతుండటం విశేషం. 2022 హ్యాంగ్‌జౌ ఆసియా గేమ్స్‌లో స్వర్ణం గెలుచుకున్న టీమిండియా, ఈసారి కూడా టైటిల్‌ను నిలబెట్టుకోవాలని పట్టుదలతో ఉంది. శ్రీలంక జట్టు ఆసియా గేమ్స్‌లో తమ తొలి క్రికెట్ గోల్డ్ మెడల్ సాధించాలని భావిస్తోంది.

**హెడ్ టు హెడ్ రికార్డు:**

మొత్తం మ్యాచ్‌లు: 32
భారత్ విజయం: 26
శ్రీలంక విజయం: 5
ఫలితం లేనిది: 1

**కీలక ఆటగాళ్లు:**

భారత జట్టు తరఫున ఫామ్‌లో ఉన్న షెఫాలీ వర్మ, స్మృతి మంధాన, కెప్టెన్ హర్మాన్‌ప్రీత్ కౌర్, ఆల్ రౌండర్ దీప్తి శర్మ మ్యాచ్ విన్నర్లుగా మారనుండగా.. శ్రీలంక జట్టు పూర్తిగా వారి స్టార్ కెప్టెన్ చమరి అతపత్తుపై ఆధారపడి ఉంది.

**మహిళల ఆసియా గేమ్స్ 2026 ఫైనల్ వివరాలు:**

తేదీ: సెప్టెంబర్ 22, 2026 (మంగళవారం)
సమయం: ఉదయం 10:30 గంటలకు (IST) (జపాన్ కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2:00 గంటలకు)
వేదిక: కోరోగి స్పోర్ట్స్ పార్క్, నిషిన్, జపాన్
టీవీ ప్రసారం: భారత్‌లో Sony Sports Network ఛానెళ్లలో ప్రత్యక్ష ప్రసారం కానుంది.
లైవ్ స్ట్రీమింగ్: SonyLIV యాప్, వెబ్‌సైట్‌లో లైవ్ చూడవచ్చు.

# CSKలో సంచలన మార్పు.. జహీర్ ఖాన్‌కు హెడ్ కోచ్ బాధ్యతలు!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ సంచలన నిర్ణయం తీసుకుంది. తమ కొత్త హెడ్ కోచ్‌గా భారత మాజీ దిగ్గజ పేసర్ జహీర్ ఖాన్ ను నియమించింది. గత 18 ఏళ్లుగా సీఎస్కేతో సుదీర్ఘ అనుబంధం ఉన్న స్టీఫెన్ ఫ్లెమింగ్ ఆ పదవి నుంచి తప్పుకోవడంతో జహీర్ ఖాన్‌కు ఈ బాధ్యతలు అప్పగించారు.

**లెఫ్ట్ ఆర్మ్ టేకింగ్ ఓవర్.. సీఎస్కే గ్రాండ్ వెల్కమ్:**

ఇంగ్లాండ్ కోచ్‌గా ఫ్లెమింగ్: 18 ఏళ్ల పాటు సీఎస్కే కోచింగ్ సెటప్‌లో కీలక పాత్ర పోషించి ఎన్నో ట్రోఫీలను అందించిన స్టీఫెన్ ఫ్లెమింగ్, జులైలో ఇంగ్లాండ్ పురుషుల టెస్టు జట్టు హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సీఎస్కేతో తన బంధాన్ని ముగించడంతో ఫ్రాంచైజీ జహీర్‌ను ఎంచుకుంది. 2017లో ఐపీఎల్ నుంచి ఆటగాడిగా రిటైర్ అయిన తర్వాత జహీర్ ఖాన్ వివిధ ఫ్రాంచైజీలలో కీలక బాధ్యతలు నిర్వర్తించాడు.

**మెంటార్‌గా జహీర్ అనుభవం:**

ముంబై ఇండియన్స్ : ముంబై ఇండియన్స్‌కు డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ ఆపరేషన్స్ గా, ఆ తర్వాత హెడ్ ఆఫ్ గ్లోబల్ డెవలప్‌మెంట్‌గా సేవలందించాడు.

లక్నో సూపర్ జెయింట్స్ : ఐపీఎల్ 2025 సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ మెంటార్‌గా వ్యవహరించాడు.

ఐపీఎల్ కెరీర్: ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB), ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున 100 మ్యాచ్‌లు ఆడిన జహీర్ 27.27 సగటుతో 102 వికెట్లు పడగొట్టాడు.

అంతర్జాతీయ రికార్డు: టీమిండియా తరఫున మూడు ఫార్మాట్లలో కలిపి ఏకంగా 610 అంతర్జాతీయ వికెట్లు సాధించాడు.

ఐదుసార్లు ఐపీఎల్ ట్రోఫీని గెలుచుకున్న చెన్నై సూపర్ కింగ్స్, 2027 సీజన్ కోసం జహీర్ ఖాన్ మార్గదర్శకత్వంలో ఒక కొత్త శకానికి శ్రీకారం చుట్టింది. జహీర్ సుదీర్ఘ క్రికెటింగ్ విజన్ సీఎస్కే యువ బౌలర్లకు, జట్టు విజయాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.

## 700 గ్రాముల బరువుతో ఫైనల్ ఛాన్స్ మిస్: రింగ్‌లోనే ఏడ్చేసిన సుచిక.. కాంస్యంతో సరి!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా గేమ్స్ 2026 లో భారత మిక్స్డ్ మార్షల్ ఆర్ట్స్ ఫైటర్ సుచిక తరియాల్ ( చారిత్రాత్మక విజయం సాధించినప్పటికీ, తీవ్ర గుండెకోతకు గురైంది. మహిళల ట్రెడిషనల్ 60 కేజీల సెమీఫైనల్‌లో అద్భుత ప్రదర్శన చేసినా, విచిత్రమైన వెయిట్ రూల్ కారణంగా ఆమె రజతం/పసిడి పోరుకు దూరమై కాంస్య పతకంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ ఫలితంతో తీవ్ర నిరాశ చెందిన సుచిక మ్యాచ్ ముగియగానే మ్యాట్‌పైనే ఒక్కసారిగా ఏడ్చేసింది.

**1000 డాలర్లు చెల్లించి ఛాలెంజ్ చేసినా:**

సింగపూర్‌కు చెందిన హ్యూ హూన్ టియో తో జరిగిన ఈ సెమీఫైనల్ పోరు అత్యంత ఉత్కంఠభరితంగా కొనసాగింది.

రెగ్యులర్ రౌండ్లు టై: ఇద్దరు ఫైటర్లు చెరో రౌండ్‌లో ఆధిపత్యం చెలాయించడంతో ఓవర్ టైమ్‌కు మ్యాచ్ వెళ్లింది. ఓవర్ టైమ్ తర్వాత కూడా విజేత ఎవరో స్పష్టంగా తేలకపోవడంతో తొలిగా టియోను విజేతగా ప్రకటించారు.

భారత్ రివ్యూ ఛాలెంజ్: రెఫరీ నిర్ణయాన్ని నిరసిస్తూ భారత మేనేజ్‌మెంట్ వి1,000 డాలర్లు (సుమారు ?84,000) ఆర్బిట్రేషన్ ఫీజు చెల్లించి సవాలు చేసింది. ఆరుగురు న్యాయనిర్ణేతలు రీ-రివ్యూ చేసి మ్యాచ్‌ను డ్రా (Draw)గా ప్రకటించారు.

**విజేతను తేల్చిన 700 గ్రాముల బరువు:**

ఇంటర్నేషనల్ మిక్స్డ్ మార్షల్ ఆర్ట్స్ ఫెడరేషన్ నిబంధనల ప్రకారం మ్యాచ్ రీ-రివ్యూ తర్వాత కూడా టై అయితే ఉదయం జరిగిన వెయిట్-ఇన్ ఆధారంగా తక్కువ బరువు ఉన్న ఫైటర్‌ను విజేతగా ప్రకటిస్తారు.

తక్కువ బరువుతో టియోకు లబ్ధి: సుచిక ఉదయం 59.2 కేజీల బరువు ఉండగా, సింగపూర్ ప్లేయర్ టియో 58.5 కేజీల బరువు ఉంది.

700 గ్రాముల తేడాతో: కేవలం 700 గ్రాములు తక్కువ బరువు ఉన్నందున టియోను విజేతగా ప్రకటించి ఫైనల్‌కు పంపారు. దీంతో సుచిక కాంస్య పతకానికి పరిమితమైంది.

**ఇది అన్యాయం.. కానీ దేశం కోసం గర్వపడుతున్నా:**

తీర్పు వినగానే తీవ్ర భావోద్వేగానికి గురైన సుచిక, నేను ఈ మ్యాచ్ గెలిచానని భావించాను.. ఫలితాన్ని అంగీకరించలేకపోతున్నాను, ఇది నాకు అన్యాయంగా అనిపించింది. కానీ దేశం కోసం కాంస్యం సాధించినందుకు సంతోషంగా ఉందని ఆవేదన వ్యక్తం చేసింది. హర్యానాలోని రోహ్‌తక్ జిల్లా కిలోయ్ గ్రామానికి చెందిన సుచిక, చిన్నతనంలో రోడ్డుపై వేధింపులను ఎదుర్కొని స్వీయ రక్షణ కోసం కాంబ్యాట్ స్పోర్ట్స్‌లోకి వచ్చి నేడు ఆసియా గేమ్స్ పీఠం ఎక్కింది.

**చరిత్ర సృష్టించిన సుచిక:**

ఓటమి బాధ పక్కనబెడితే, ఆసియా గేమ్స్ చరిత్రలో మిక్స్డ్ మార్షల్ ఆర్ట్స్ (వీహూ) విభాగంలో భారత్‌కు తొలి పతకం అందించిన అథ్లెట్‌గా సుచిక తరియాల్ చరిత్ర పుటలకెక్కింది. సుచిక సాధించిన ఈ కాంస్యంతో ఆసియా గేమ్స్ 2026లో భారత పతకాల సంఖ్య 6కు (4 వెండి, 2 కాంస్యం) చేరింది.

# దసరాకు వస్తే హిట్టే.. మరి ఈసారి?

టాలీవుడ్ లో కొంతమంది హీరోలకు కొన్ని సీజన్లతో స్పెషల్ రిలేషన్ ఉంటుంది. సీనియర్ హీరో విక్టరీ వెంకటేష్ కు సంక్రాంతి అలాంటి సీజన్ అయితే.. దసరా కూడా కలిసొచ్చిన సందర్భాలు ఉన్నాయి. దాదాపు 40 ఏళ్ల సినీ జర్నీలో ఆయన దసరా సమయంలో చాలా తక్కువ సినిమాలతోనే ప్రేక్షకుల ముందుకు వచ్చారు. కానీ వచ్చిన ప్రతిసారీ బాక్సాఫీస్ దగ్గర తన మార్క్ చూపించారు. ఇప్పుడు మరోసారి దసరా సీజన్ లో వెంకీ సినిమా రాబోతుండటంతో ఆ సెంటిమెంట్ పై చర్చ మొదలైంది.వెంకటేష్ ఇప్పటివరకు దసరా సీజన్ ను టార్గెట్ చేస్తూ నాలుగు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది. వాటిలో ఎక్కువ సినిమాలు మంచి విజయాలను అందుకున్నాయి. దీంతో దసరా సీజన్ కూడా వెంకీకి కలిసొచ్చే టైమ్ గా మారింది. 2000లో వచ్చిన జయం మనదేరా అందుకు బెస్ట్ ఎగ్జాంపుల్. అక్టోబర్ లో దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆ సినిమా భారీ విజయాన్ని అందుకుంది.వెంకటేష్ కెరీర్ లో గుర్తుండిపోయే చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. యాక్షన్, ఎమోషన్ తో సాగిన ఆ సినిమా అప్పట్లో ప్రేక్షకులను థియేటర్లకు బాగానే రప్పించింది. ఆ తర్వాత 2007లో తులసితో మరోసారి దసరా బరిలోకి దిగారు వెంకటేష్. బోయపాటి శ్రీను





దర్శకత్వంలో తెరకెక్కిన ఆ సినిమా యాక్షన్ తో పాటు కుటుంబ ప్రేక్షకులకు నచ్చే అంశాలతో వచ్చింది. దసరా సెలవులను క్యాష్ చేసుకున్న ఆ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. 2008లో చింతకాయల రవితో మరోసారి ఇదే సీజన్ లో సందడి చేశారు.ఆ సినిమా గత రెండు చిత్రాల రేంజ్ లో విజయం సాధించకపోయినా.. ప్రేక్షకులను అలరించింది. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులకు కనెక్ట్ అయింది. ఇలా దసరా సీజన్‌లో వెంకటేష్ కు వచ్చిన సినిమాలను చూస్తే.. ఎక్కువ సందర్భాల్లో మంచి రిజల్ట్సే కనిపిస్తాయి. అందుకే ఇప్పుడు రాబోతున్న కొత్త సినిమాపై కూడా ఆ సెంటిమెంట్ చర్చగా మారింది. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో వెంకటేష్ నటిస్తున్న ఆదర్శ కుటుంబం ఈసారి దసరా బరిలోకి దిగేందుకు సిద్ధమవుతోంది. కుటుంబ కథతో పాటు యాక్షన్, కామెడీ ఎలిమెంట్స్ తో తెరకెక్కుతోంది.ముందు అక్టోబర్ 2న విడుదల చేయాలనే ఆలోచన ఉండగా.. దసరా సెలవులను యూజ్ చేసుకునేలా పండుగ వారంలో విడుదల చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే వచ్చిన టీజర్ సినిమాపై హైప్ పెంచింది. త్రివిక్రమ్ డైలాగ్స్, వెంకటేష్ యాక్టింగ్ కలిస్తే ఎలా ఉంటుందనే ఆసక్తి అభిమానుల్లో కనిపిస్తోంది. పైగా దసరా సీజన్ వెంకీకి గతంలో మంచి రిజల్ట్స్ ఇచ్చిన సందర్భాలు ఉండటంతో అంచనాలు మరింత పెరుగుతున్నాయి.అయితే గత రికార్డులు కొత్త సినిమాకు విజయాన్ని ఫిక్స్ చేయవని చెప్పాలి. ఈసారి కథ, కామెడీ, వెంకటేష్ యాక్టింగ్, త్రివిక్రమ్ టేకింగ్ తో పాటు దసరా సెలవులను సినిమా ఎంతవరకు యూజ్ చేసుకుంటుందనేదే మెయిన్. గతంలో దసరా సెంటిమెంట్ ను సక్సెస్ గా మార్చుకున్న వెంకీ.. ఈసారి ఆదర్శ కుటుంబంతో ఆ జోష్ ను కంటిన్యూ చేస్తారా అనేది వేచి చూడాలి.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965